నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నల్లగొండ రీజియన్
శనివారం | డిసెంబర్ 09,2023 | www.navatelangana.com

ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డిని కలిసిన స్థానికులు



నవతెలంగాణ - భువనగిరి

భువనగిరి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ని శుక్రవారం ఆయన నివాసం హైదరాబాదులో లో హృదయపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎండి యూనిస్, హుంబెర్ రెహమాన్, అన్వర్, కరీం, జుబేర్ రెహ్మాన్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యని కలసిన పలువురు అధికారులు

నవతెలంగాణ-ఆలేరుటౌన్



ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో 50వేల భారీ మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలుపొందిన బీర్ల ఐలయ్యను శుక్రవారం ఆయన నివాసం వద్ద పలువురు అధికారులు కలిశారు. ఆర్డీవో ,ఎంపీ భూపాల్ రెడ్డి,ఆలేరు రురల్ సిఐ సురేందర్ రెడ్డి,యాదగిరిగుట్ట సిఐ రమేశ్, ఆలేరు ఎస్సై, జి వెంకట శ్రీను, తుర్కపల్లి, ఎస్ఐ రాఘవేందర్ గౌడ్,రాజపేట ఎస్ఐ, సుధాకర్ రెడ్డి,మోటకొండూరు ఎస్ఐ తేజం రెడ్డి, ఎస్ఐ యకాన్న, ఎంపీడీఓ జ్ఞానప్రకాశ్ రావు,ఎంపీఓ సలీమ్ పూల బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు.

అవిశ్వాసంలో.. మున్సిపాలిటీ..?

- మారనున్న చైర్మెన్, వైస్ చైర్మెన్ పీఠం
- అధికారంకు మద్దతుగా గులాబీలు సిద్ధం
- చక్రం తిప్పుతున్న బీసీ నేత పాలకుల్లో గుబులు
- మారనున్న మిర్యాలగూడ మున్సిపల్ పాలకవర్గం...?

నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థలను తమ ఆధీనంలోకి తీసుకోవాలని ప్రయత్నాలు మొదలుపెట్టింది. మొన్నటి వరకు ప్రతిపక్షంలో ఉండి తీవ్ర ఇబ్బందులు పడ్డ కాంగ్రెస్ నాయకులుకు ఎప్పుడు స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వం తమదే కావడంతో మున్సిపాలిటీ కైవసం చేసుకున్నందుకు ఇప్పటికే ముమ్మర ప్రయత్నాలు ప్రారంభించారు.. అవిశ్వాసం పేరుతో మున్సిపల్ చైర్మెన్, వైస్ చైర్మెన్ పదవులను తమ వారికి వచ్చేలా ఎత్తుగడలు వేస్తున్నారు. మెజార్టీ స్థానాలు గులాబీ పార్టీ వారికి ఉన్నప్పటికీ వారిలో ఉన్న అసంతృప్తి సభ్యులను తమ వైపు తిప్పుకొని అవిశ్వాసంలో నేగ్గాలని ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ బీసీ నేత కీలకంగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. దీంతో త్వరలోనే మిర్యాలగూడ మున్సిపాలిటీ ముఖచిత్రం మారే అవకాశం కనిపిస్తుంది.



నవతెలంగాణ- మిర్యాలగూడ

గ్రేడ్ వన్ మున్సిపాలిటీగా గుర్తింపు పొందిన తర్వాత మిర్యాలగూడ మున్సిపాలిటీలో 2020లో మున్సిపల్ ఎన్నికల సందర్భంగా 48 వార్డులగా చేశారు. గతంలో 36 వార్డులు ఉంటే తిరిగిన జనాభా కనుగుణంగా 2020లో 12 వార్డులను పెంచుతూ 48 గా మార్చారు. ఆ సమయంలో జరిగిన ఎన్నికల్లో 27 వార్డులు బీఆర్ఎస్ 18 వార్డులు కాంగ్రెస్, ఒకటి సీపీఐ(ఎం), ఒకటి బీజేపీ, మరొకటి ఇండిపెండెంట్ గెలుపొందారు. అధిక స్థానాలు గెలుపొందిన బీఆర్ఎస్ చైర్మెన్, వైస్ చైర్మెన్ పదవులను దక్కించుకుంది. ఇప్పుడు 13 నెలలో వీరి పదవి కాలం ముగియనుంది. ఈ సమయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. ఈ నేపథ్యంలోనే సీపీఐ(ఎం) కౌన్సిలర్ కాంగ్రెస్ లో చేరారు దీంతో కాంగ్రెస్ బలం 20కి చేరింది. ఇందులో ఇండిపెండెంట్ ఒకరు చనిపోగా 19 మంది ఉన్నారు. ప్రస్తుత చైర్మెన్, వైస్ చైర్మెన్ వ్యవహార శైలి వ్యక్తిగత పోవడల కారణంగా బీఆర్ఎస్ పార్టీ సభ్యుల్లో ఎక్కువ మంది అసంతృప్తులుగా ఉనట్లు సమాచారం.బీఆర్ఎస్ పార్టీకి చెందిన ముగ్గురు, స్వతంత్రులు ఒకరు కౌన్సిలర్లు చనిపోగా గత సంవత్సరన్నర కాలంగా ఈ వార్డులో ఉప ఎన్నికలు జరగకపోవడంతో ఖాళీగా ఉన్నాయి.

కీలకంగా వ్యవహరిస్తున్న బీసీ నేత

బీఆర్ఎస్ పార్టీకి ఎమ్మెల్యే తో కలిసి 28 మంది సభ్యులు ఉండగా ఇందులో ఇద్దరు అనారోగ్యంతో చనిపోగా ఒకరు ఆత్మహత్య చేసుకున్నారు. ఇప్పుడు ఎమ్మెల్యే ఒడిపోవడంతో వీరి బలం 24 కు చేరింది. ఇందులో ఎక్కువ మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు అసంతృప్తిగా ఉండడంతో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసేందుకు సిద్ధమైనట్లు సమాచారం. 48 మందిలో 4గురు చనిపోగా మిగిలిన 44 మందిలో 2/3 వంతు అంటే 23 మంది ఉంటే అవిశ్వాసం నెగ్గుతుంది.ఇప్పుడు ప్రస్తుతం కాంగ్రెస్ కు 18 మంది కౌన్సిలర్లు ఉన్నారు. ఎమ్మెల్యే, ఎంపీ తో కలిపి 20 మంది అయ్యారు. ఇంకా ముగ్గురు లేదా నలుగురు మద్దతు ఇస్తే సరిపోతుంది. ఇప్పుడు బీఆర్ఆర్ కౌన్సిలర్లు 6 నుంచి 8 మంది కి పైగా బీఆర్ఎస్ కౌన్సిలర్లు పార్టీ మారేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. అసంతృప్తి బీఆర్ఎస్ కౌన్సిలర్లను కాంగ్రెస్లో చేర్పించేందుకు కాంగ్రెస్ పార్టీ చెందిన బీసీ నేత కీలకంగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. ఈ వారం పది రోజుల్లో వారిని పార్టీలో చేర్పించుకోడమా. .? లేకా అవిశ్వాసంలో వారి మద్దతు తీసుకోవడం మా అనే విషయంపై సుదీర్ఘంగా చర్చలు జరుగుపుతున్నట్లు విశ్వసినియవర్గాల ద్వారా తెలిసింది. నేడో..రేపో మున్సిపాలిటీ అవిశ్వాసం పెట్టాలని కాంగ్రెస్ నాయకులు నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. అవిశ్వాస తీర్మానంతో మిర్యాలగూడ మున్సిపాలిటీ ముఖ చిత్రం మారనుంది.



ప్రజావాణి అర్జీల పరిష్కారానికి ప్రత్యేక కృషి

- సీఎం గ్రీవెన్స్ దరఖాస్తులకు ప్రత్యేక సెల్
- ప్రతి అర్జీకి రసీదు అందించాలి
- జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావ్

నవతెలంగాణ-సూర్యాపేట కలెక్టరేట్

ప్రజావాణి అర్జీలపై పరిష్కారాలు ఎక్కువ జరగాలని ఆదిశగా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ ఆదేశించారు.శుక్రవారం జిల్లా అధికారులతో కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారాల పై ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు సంబంధించి ముఖ్యమంత్రి గ్రీవెన్సు నుండి వచ్చే దరఖాస్తులకు కలెక్టరేట్ లో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయనున్నట్లు ఈ సెల్ ఆదనపు కలెక్టర్ రెవెన్యూ ఆధ్వర్యంలో పనిచేస్తుందని తెలిపారు. ప్రతి మండలంలో కూడా ప్రజావాణి లో మండల స్థాయి అధికారులు తప్పక పాల్గొనాలని అర్జీదారులు, అధికారులు వెబెక్స్ స్క్రీన్ లో కనపడాలని అన్నారు. త్వరలో జి.పి. స్థాయిలో కూడా ప్రజావాణి కార్యక్రమం చేపట్టుటకు సి.ఈ.ఓ, డి.పి.ఓ లకు సత్వర చర్యలు చేపట్టాలని సూచించారు. శనివారం సాయంత్రం వరకు ఆయా మండలంలో ఉన్న ప్రజావాణి దరఖాస్తులను గూగుల్ షీట్ లో పంపాలని సూచించారు. ప్రజావాణిలో వచ్చే అర్జీలకు రసీదులు అందచేయాలని , మండలాలకు సంబంధించిన అర్జీలను వెంటనే అప్ లోడ్ చేయాలని సూచించారు. గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు ప్రజల నుండి వివిధ సమస్యలకు సంబంధించిన అర్జీల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను కలెక్టర్ ఈ సందర్భంగా ఆదేశించారు.ఈ సమావేశంలో జెడ్.పి. సి.ఈ. ఓ సురేష్, పి.డి. కిరణ్ కుమార్, సి.పి.ఓ వెంకటేశ్వర్లు, జి.ఎం. పరిశ్రమలు తిరుపతయ్య, డి.సి.ఓ మోహన్ బాబు, ఏ.ఓ సుదర్శన్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

10లోగా దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-భువనగిరిరూరల్

దివ్యాంగుల సాధికారతా అవార్డులకు ఈనెల 10 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మహిళా శిశు, దివ్యాంగ సంక్షేమ అధికారి జి.అన్నపూర్ణ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలో వివిధ రంగాలలో ప్రతిభ కనబరచిన దివ్యాంగులు, వారి సంక్షేమం కోసం కృషి చేసిన వ్యక్తులను రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం అందించే రాష్ట్రీయ దివ్యాంగుల సాధికారత అవార్డ్ 2023 కొరకు ఆసక్తి గల దివ్యాంగుల నుండి , పనిచేస్తున్న వివిధ సంస్థల నుండి దరఖాస్తులను ఆన్లైన్ ద్వారా ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఉత్తమ ఉద్యోగి, ఉత్తమ స్వీయ ఉద్యోగి, ఉత్తమ వ్యక్తిగత సామాజిక కార్యకర్త, ఉత్తమ క్రీడా వ్యక్తి, ఉత్తమ సంస్థ, బెస్ట్ ఎంప్లాయర్, దివ్యాంగుల కోసం అందుబాటులో ఉండే విభాగం, సాంస్కృతిక కార్యక్రమాలలో వైకల్యాలున్న వ్యక్తులకు అవార్డులు అందచేయడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి గలవారు ఈనెల 10 తేదీలోగా అన్ని వివరాలతో ఆన్లైన్ వెబ్‌సైట్ www.wdsc.telangana.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఎన్నికల్లో ఓటమికి కారణాలను పరిశీలించుకొని ముందుకెళ్తాం

- బీఆర్ఎస్ పై వ్యతిరేకతతోనే కాంగ్రెస్ కు ఓట్లు
- ప్రజా సమస్యలపై పోరాటాలు చేయాలి
- స్థానిక సంస్థల ఎన్నికలకు ఇప్పటినుండి సిద్ధం కావాలి
- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి

నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్



శాసనసభ ఎన్నికల్లో సిపిఎం పార్టీ పోటీ చేసిన స్థానాలలో ఓటమికి గల కారణాలను పరిశీలించుకుని భవిష్యత్తు కార్యాచరణ రూపొందించుకుంటామని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు.శుక్రవారం స్థానిక దొడ్డి కొమరయ్య భవనంలో రాష్ట్ర కమిటీ సభ్యులు తుమ్మల వీరారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఆ పార్టీ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు రెండు ప్రధానమైన పార్టీల మధ్య పోటీగా చూశారని, బీఆర్ఎస్ ఓడిపోవాలంటే కాంగ్రెస్ కు ఓట్లు వేశారని తెలిపారు. కాంగ్రెస్ రావద్దు అనేవారు బీఆర్ఎస్‌కు, బీఆర్ఎస్ రావద్దు అనేవారు కాంగ్రెస్ కు ఓట్లు వేశారని, మూడవ పార్టీ వైపు ఓటర్లు చూడలేదని, ఓటు వేయాలని ఆలోచించలేదని పేర్కొన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ఓడిపోవడానికి ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు సక్రమంగా అమలు చేయకపోవడమే కారణమన్నారు. దళిత, బీసీ, మైనారిటీ బంధు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, నిరుద్యోగ సమస్య, రైతుల సమస్యలు, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించక పోవడం వలనే, బిఆర్ఎస్ ను ఓడించారని, నిరంకుశ ప్రజాస్వామిక పోకడలు, కుటుంబ పాలన, నిధుల దుర్వినియోగం జరిగినట్లు ప్రజలు నమ్మారని అన్నారు. అవినీతి, అక్రమాలు స్థానిక ఎమ్మెల్యేల మీద తీవ్రమైన వ్యతిరేకత అందర్నీ కలుపుకొని పోకపోవడం వల్ల బీఆర్ఎస్ ప్రభుత్వం ఓడిపోయిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ప్రభుత్వ వ్యతిరేకత ఆరు పథకాలు ప్రజల ముందు పెట్టడం ప్రజలు వాటిని నమ్మడం అందరూ కలిసి పనిచేయడం వలన గెలిచిందని, తెలిపారు.సిపిఎం పోటీ చేసిన నియోజకవర్గాలలో ఓట్లు నిలబెట్టుకోలేక పోయామని ఒంటరిగా గెలవలేరని మెజారిటీ, శ్రేణులు కాంగ్రెస్ కు ఓటు వేసినారని, అన్నారు. బిఆర్ఎస్ మీద ఉన్న వ్యతిరేకతతో సిపిఎం శ్రేణులు కాంగ్రెస్ కు ఓట్లు వేశారని అన్నారు. ఇలాంటి పరిస్థితులను ఎక్కడ పొరపాటు చేసినామో ఆత్మ పరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉందని అలాగే పార్టీ నిర్మాణం సరి దిద్దుకోవటం ప్రజా సమస్యలపై మరిన్ని పోరాటాలకు సిద్ధం కావాలని రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు ఎదుర్కోవడానికి ఇప్పటినుండే సిద్ధం కావాలనిపిలుపునిచ్చారు. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఆశిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి ,రాష్ట్ర కమిటీ సభ్యులు నారి ఐలయ్య, డబ్బికారు మల్లేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాలడుగు నాగార్జున, బండ శ్రీశైలం, కందాల ప్రమీల,సయ్యద్ హషం, పాలడుగు ప్రభావతి, చినపాక లక్ష్మీనారాయణ జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ రైతు వ్యవస్థను పునరుద్ధరించాలి



- ఆదర్శ రైతు వ్యవస్థ ద్వారా రైతులకు అధికారులకు మేలు జరిగింది
- ఆదర్శ రైతు సంఘం మండల అధ్యక్షులు బూరుగు వెంకటేశం

నవతెలంగాణ -రామన్నపేట

రెండు దశాబ్దాల క్రితం కాంగ్రెస్ పాలనలో నాటి ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి తీసుకొచ్చిన ఆదర్శ రైతు వ్యవస్థ ద్వారా వ్యవసాయ శాఖ అధికారులకు రైతులకు ఎంతో మేలు జరిగిందని, ఆదర్శ రైతు వ్యవస్థను పునరుద్ధరించాలని ఆదర్శ రైతు సంఘం మండల అధ్యక్షులు బూరుగు వెంకటేశం ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో ఉన్న రైతులకు సలహాలు, సూచనలు అందించడానికి ఆదర్శ రైతు వ్యవస్థను రూపొందించారని, ప్రతి వందమంది రైతులకు ఒక ఆదర్శ రైతును నియమించారని తెలిపారు. ఆదర్శ రైతులు అధికారులకు రైతులకు అనుసంధానకర్తలుగా వ్యవహరిస్తూ వచ్చారని, ఆదర్శ రైతు పరిధిలోనీ రైతులు తమ భూములలో వేసిన పంటల వివరాలను రికార్డ్ చేసుకోవడం, భూసార పరీక్షలు చేయించడం, ప్రభుత్వ అందించే విత్తనాలను ఎరువులను రైతులకు అందేలా చూసేవారని, అలాంటి వ్యవస్థను బిఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాల క్రితం రద్దుచేసి దాని స్థానంలో రైతుబంధు సమన్వయ సమితి వ్యవస్థను తీసుకువచ్చింది అన్నారు. ఆ వ్యవస్థ పేరుకు మాత్రమే ఉందని, పదవులు అనుభవించారే తప్ప రైతులకు ఎలాంటి మేలు జరగలేదని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చినందున రైతులకు మేలు జరగడం కోసం ఆదర్శ రైతు వ్యవస్థను పునరుద్ధరించాలని నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన కోరారు. ఆయన వెంట ఆదర్శ రైతులు నోముల దశరథ, బుడ్డ రాములు, ఆముద లక్ష్మణ్, నక్క రాంనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



మిగిలిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

సీపీఐ(ఎం)జిల్లా కార్యదర్శి ఎండి.జహంగీర్

నవతెలంగాణ-గుండాల

మిగిలిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని,ధాన్యానికి మద్దతు ధర పెంచాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎండి.జహంగీర్ ప్రభుత్వాన్నీ డిమాండ్ చేశారు. శుక్రవారం మోత్కూర్ లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు మళల పొలం పనులలో నిమగ్నమవుతున్న సమయంలో ఇంకా జిల్లాలో 30శాతం పైగా ధాన్యం కూడా కొనుగోలు కాకుండా మిగిలి ఉన్నందన్నారు. వెంటనే నూతన ప్రభుత్వం పెంచుతానని ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానం అమలు చేస్తూ మద్దతు ధర పెంచి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాటూరు బాలరాజ్ గౌడ్,కల్లూరి మల్లేశం,దాసరి పాండు జిల్లా కమిటి సభ్యులు బొల్లు యాదగిరి,మండల కార్యదర్శి గుండు వెంకట నర్సు,పట్టణ కార్యదర్శి కూరపాటి రాములు,జిల్లా నాయకులు బుర్రు అనిల్,నర్సింహ పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య రాక

నవతెలంగాణ- ఆలేరుటౌన్

కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకురాలు, సోనియా గాంధీ జన్మదినం పురస్కరించుకొని, ఆలేరు పట్టణంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జన్మదిన వేడుకలకు ఆలేరు శాసనసభ్యులు, బీర్ల ఐలయ్య ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షులు కొండ్రాజు వెంకటేశ్వరరాజు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జన్మదిన వేడుకలకు మండలంలోని జెడ్పిటిసి, ఎంపిపి, ఎంపీటీసీ లు ,సర్పంచ్లు,కౌన్సిలర్లు,యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ, బీసీ, ఎస్సీ ,ఎస్టీ, నాయకులు, మైనారిటీ సెల్ విభాగాల నాయకులు మహిళలు కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మొక్కు చెల్లించుకున్న స్వామి

నవతెలంగాణ-యాదగిరిగుట్టరూరల్

ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలవడంతో ఆయన వీరాభిమాని గంధ మల్ల స్వామి శుక్రవారం మొక్కు తీర్చుకున్నాడు. యాదగిరిగుట్ట మండలం రామాజీపేట గ్రామం శుక్రవారం యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామికి తలనీలాలు అర్పించి మొక్కు చెల్లించుకున్నాడు.

లక్ష్మీనారాయణ మృతి పార్టీకి తీరని లోటు

నవతెలంగాణ-చిలుకూరు



రావెళ్ల లక్ష్మీనారాయణ మృతి టీఆర్ఎస్ పార్టీకి కార్యకర్తలకు తీరనిలోటని ఎంపీటీసీ 1 బెల్లంకొండ రమణ నాగయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన పార్థీవదేహానికి శ్రద్ధాంజలి ఘటించిన సందర్భంగా ఆమె మాట్లాడుతూ రావెళ్ల లక్ష్మీనారాయణ అకాల మృతి వలన పార్టీకి కార్యకర్తలకు తీవ్రమైన నష్టం జరుగుతుందన్నారు గత పది సంవత్సరాలుగా టీఆర్ఎస్ పార్టీలో కార్యకర్తలకు పార్టీకి ఎనలేని సేవలు అందించారన్నారు అటువంటి వ్యక్తి మృతి చెందడం బాధాకరమన్నారు టీఆర్ఎస్ మండల నాయకులు కార్యకర్తలు కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు ఈ కార్యక్రమంలో అయా గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు టీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

యతిపతిరావుకు వీడ్కోలు సన్మానం

నవతెలంగాణ-హుజూర్‌నగర్

పట్టణంలోని ఎస్ఎస్పి క్యాంప్ ప్రాథమిక పాఠశాలలో సుదీర్ఘకాలం ఎల్ ఎఫ్ ఎల్ ప్రధాన ఉపాధ్యాయుడుగా పనిచేసి సూర్యాపేట పట్టణంలోని హనుమాన్ నగర్ హై స్కూల్ కు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు బదిలీపై వెళ్తున్న విష్ణు దాస్యం యతిపతిరావుకు శుక్రవారం పాఠశాలలో వీడ్కోలు సమావేశం నిర్వహించి ఘనంగా ఉపాధ్యాయులు సన్మానించారు ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఎస్ఎస్పి క్యాంప్ ప్రాథమిక పాఠశాల లోవిద్యార్థుల సంఖ్య పెంచడానికి మరియు పాఠశాలను పలు రకాల అభివృద్ధి చేయడానికి యతిపతిరావుకృషి మరువలేనిది అన్నారు ఈ ప్రాథమిక పాఠశాలకు జిల్లా స్థయిలోనే మంచి గుర్తింపు తీసుకొచ్చాడు అన్నారు ఈ కార్యక్రమంలో రిటైర్ ఎంఈఓ దేవదానం ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి రాధా దుర్గా ఉపాధ్యాయురాలు డి విజయ ఎల్ఐసి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ప్రధానోపాధ్యాయురాలు పుతీలి బేగం నందిపాటీ సైదులు గుత్తికొండ లింగారెడ్డి లక్ష్మీకాంతం అరుణకుమారి శివయ్య అనిత పద్మ కుమారి మరియు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచిత ప్రయాణం

- ప్రభుత్వం ఉత్తర్వులు జారీ
- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం
- జిల్లాలో 170 బస్సులు అందుబాటులో
- హర్షం వ్యక్తం చేస్తున్న మహిళలు

నవతెలంగాణ-సూర్యాపేట



మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. శనివారం మధ్యాహ్నం నుంచి జిల్లాలో బాలికలు, మహిళలు, ట్రాన్స్ జెండర్లు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చని తెలిపింది. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తామని అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఇదొకటి. అయితే పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మాత్రమే మహిళల ఉచిత ప్రయాణానికి అవకాశం కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. కాగా, మహాలక్ష్మి పథకానికి అయ్యే ఖర్చును ప్రభుత్వం ఆర్టీసికి చెల్లిస్తుంది.ఈ నేపథ్యంలో జిల్లాలో ని సూర్యాపేట డిపోలో 100 ఆర్డినరి,ఎక్స్‌ప్రెస్ బస్సులు ఉన్నాయి. అదేవిధంగా కోదాడ డిపోలో 70 బస్సులు నిత్యం ఆయా గ్రామాల్లో తిరుగుతున్నాయి. సందర్భంగా జిల్లాలోని రెండు డిపోలో శనివారం మధ్యాహ్నం 1:30 నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం పథకం అమలు కానుంది. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది.కాగా జిల్లాలోని పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఈ ఉచిత ప్రయాణం ఉండనుంది. బాలికలు, మహిళలు, ట్రాన్స్?జెండర్లకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి అర్హులు. రాష్ట్ర పరిధిలోని ఆర్టీసీ బస్సులకు మాత్రమే ఈ ఫ్రీ ప్రయాణం ఉండనుంది.కాగా మహిళా ప్రయాణికుల చార్జి మొత్తాన్ని ఆర్టీసీ ప్రభుత్వమే చెల్లించనుంది.సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా ఈ పథకాన్ని లాంఛ్ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు జీరో టికెట్ ఇస్తారని ఇక్కడి డిపో అధికారులు వివరించారు. మహాలక్ష్మి పథకం వల్ల ప్రజా రవాణా కు మేలు జరుగుతుందని చెప్పారు. కొవిడ్? వల్ల ప్రజా రవాణాకు తీవ్ర విఘాతం కలిగిందని ఆవేదన చెందారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణానికి సంబంధించి మార్గదర్శకాలు జారీ అయ్యాయి. బాలికలు, మహిళలు, ట్రాన్స్ జెండర్ల వరకు అన్ని వయసుల వారికి ఉచిత బస్సు ప్రయాణం ఉంటుంది. తెలంగాణ పరిధిలో ఉచితంగా ప్రయాణం చేయవచ్చు. డిసెంబర్ 9 మధ్యాహ్నం నుంచి ఇది అమల్లోకి వస్తుంది. జిల్లాల్లో పల్లె వెలుగు, ఎక్స్ ప్రెస్ బస్సులలో ఉచిత ప్రయాణానికి అనుమతి ఇచ్చారు. సిటీలో ఆర్డినరీ, ఎక్స్ ప్రెస్ బస్సుల్లో మాత్రమే అనుమతి ఉంది. అంతరాష్ట్ర బస్సుల విషయానికి వస్తే తెలంగాణ పరిధి వరకు మాత్రమే ఉచితంగా ప్రయాణించే అవకాశం ఉంది. ఆ తర్వాత టికెట్ తీసుకోవాల్సిందే. మొదటి వారం రోజుల వరకు ఎలాంటి ఐడెంటీ కార్డులు లేకుండానే ప్రయాణం చేయ వచ్చని అధికారులు చెబుతున్నారు. రాష్ట్రం దాటి వెళ్లే పల్లె వెలుగు, ఎక్స్ ప్రెస్ బస్సుల్లో తెలంగాణ బోర్డర్ వరకే మహిళలకు బస్సు ప్రయాణం ఉచితం ఉంటుంది ఆ తర్వాత టికెట్ తీసుకోవాల్సి ఉంటుంది.ఈ క్రమంలో ప్రభుత్వం మహిళలు ప్రయాణించిన దూరాన్ని తెలుసుకోవడానికి వీలుగా త్వరలో వారికి మహాలక్ష్మి స్మార్ట్ కార్డు ఇవ్వనుంది.

కమ్యూనిస్టులకు గెలుపు ఓటములు సహజం

- వచ్చిన ఫలితాలను విశ్లేషించుకుంటాం
- ప్రజా ఉద్యమాలకు పదును పెడతాం
- సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి

నవతెలంగాణ-కోదాడరూరల్



అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలపై విశ్లేషించుకొని భవిష్యత్తులో ప్రజా సమస్యలపై ఉద్యమాలు నిర్వహిస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లునాగార్జునరెడ్డి అన్నారు.శుక్రవారం పట్టణంలోని సుందరయ్య భవన్ లో నిర్వహించిన సిపిఎం పార్టీ నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. కమ్యూనిస్టులు గెలిచిన,ఓడిన ప్రజాపక్షమే ఉంటారన్నారు. సీట్లు ముఖ్యం కాదన్నారు. సూర్యాపేట జిల్లాలో ప్రజా పునాది కలిగిన హుజూర్ నగర్, కోదాడ నియోజకవర్గాల్లో సిపిఎం ఒంటరిగా పోటీ చేసిందన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి ఇతర పార్టీలు విచ్చలవిడిగా మద్యం, డబ్బు వెదజల్లి ఓటర్లను ప్రలోభాలకు గురిచేసి గెలిచారని అన్నారు. రెండు నియోజకవర్గాలలో రూపాయ పంచకుండా ప్రజల ఓట్లను పొందిన ఏకైక పార్టీ సిపిఎం మాత్రమే అన్నారు. క్షేత్రస్థాయిలో పార్టీని అభివృద్ధిని చేస్తామన్నారు. వచ్చిన ఫలితాలను విశ్లేషించుకుని భవిష్యత్తులో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. ఇటీవల కురిసిన అకాల వర్షాల మూలంగా దెబ్బతిన్న పత్తి,వరి పంటలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వరి,పత్తి పంటలకు ఎకరాకు 50 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు పట్ల సంతోషం వ్యక్తం చేస్తున్నామనిఅన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వానికి మా పార్టీగా సంపూర్ణమైన సహాయ సహకారాలుఅందిస్తామన్నారు. ప్రజా, కార్మిక, రైతాంగ సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమాలు నిర్వహిస్తామని అన్నారు. సిపిఎం పార్టీ మునగాల మండల కార్యదర్శి చందా చంద్రయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నెమ్మది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, మట్టిపల్లి సైదులు, మేదరమెట్ల వెంకటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులుజిల్లపల్లి నరసింహారావు, దేవరం వెంకటరెడ్డి, బెల్లంకొండ సత్యనారాయణ, మిట్ట గనుపుల ముత్యాలు, బెల్లంకొండ వెంకటేశ్వర్లు, జుట్టుకొండ బసవయ్య, సిపిఎం సీనియర్ నాయకులు రాపోలు సూర్యనారాయణ పాల్గొన్నారు.

30న లోక్ అదాలత్



నవతెలంగాణ-భువనగిరి

ఈ నెల 30న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ పై జిల్లాలోని న్యాయమూర్తులు, పోలీసు, జిల్లా పరిపాలన యంత్రాంగం పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో శుక్రవారం భువనగిరి కోర్టులో యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ,జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ అధ్యక్షులు ఎ. జయరాజు సమీక్షా సమన్వయ సమావేశాని నిర్వహించారు. ఈ సందర్భంగా మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి కె. మారుతి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టుల ఆవరణలలో ఈ నెల 30న ఉదయం 10గంటల నుండి సా 5 గంటల వరకు జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ జాతీయ లోక్ అదాలత్ లో రాజీ పడదగు అన్ని క్రిమినల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, ట్రాఫిక్ చలనా కేసులు, కుటుంబ తగాద కేసులు, అన్ని సివిల్ సంబంధిత కేసులు ,కోర్టుకు వరకు రాకుండ ఉన్న బ్యాంక్, టెలిఫోన్, చిట్ ఫండ్ బాకీ వివాదాలు ప్రి లిటిగెషన్ కేసుల ద్వారా పరిష్కరించనున్నట్టు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు సివిల్,క్రిమినల్ కేసులు మొత్తంగా 4888, బీఎస్ఎన్ఎల్ కు సంబంధించి 421 కేసులు మొత్తంగా 5309 కేసులు పరిష్కారానికి గుర్తించినట్టు తెలిపారు. అన్ని కోర్టులకు ప్రత్యేకించి బెంచ్ లను ఏర్పాటు చేయటం జరిగిందని, డీసీపీ రాజేష్ చంద్ర మాట్లాడుతూ రాజీ పడతగు అన్ని క్రిమినల్ కేసుల పరిష్కారానికి ఇప్పటికే తగిన సూచనలు పోలీసు యంత్రాంగానికి ఇచ్చినట్లు తెలిపారు.డీఆర్ఓ పద్మజా రాణి కోర్టులో పెండింగులో ఉన్న భూ సేకరణ కేసుల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలోఅదనపు సీనియర్ సివిల్ జడ్జ్ , జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఇంచార్జ్ కార్యదర్శి కె. దశరథ రామయ్య, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జ్ డి. నాగేశ్వర్ రావు, అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ జి. కవిత, జిల్లా డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీసు యం. రాజేష్ చంద్ర, జిల్లా రెవిన్యూ అధికారి పద్మజారాణి, ట్రాఫిక్ సి.ఐ.మధుసూదన్, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ధామోధర్ రెడ్డి, స్వామి, సత్యనారాయణ,వర్చువల్ విధానంలో రామన్నపేట, ఆలేరు, చౌటుప్పల్ న్యాయమూర్తులు పాల్గొన్నారు.

తొలితరం ఉద్యమకారులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలి

- బొమ్మిడి లక్ష్మీనారాయణ
- సియం కు వినతిపత్రం అందజేత

నవతెలంగాణ-సూర్యాపేట



1969 తొలి తెలంగాణ ఉద్యమకారులకు రాష్ట్రంలో ఏర్పడిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పెన్షన్ సౌకర్యం కల్పించాలని తొలితరం ఉద్యమకారుల అధ్యక్షుడు బొమ్మిడి లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాదులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఆయనకు వినతి పత్రం సమర్పించారు. అంతకు ముందు ఆయన ఉద్యమకారులతో కలిసి గన్ పార్క్ దగ్గర అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1969 ఉద్యమ సమయంలో ఆనాటి ప్రభుత్వాలు ఉద్యమకారులని జైలులో పెట్టి హింసలకు గురి చేశారని వాపోయారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఏ ప్రభుత్వాలు తమని ఆదుకోలేదని తెలిపారు. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన కూడా తమ డిమాండ్లు నెరవేర్చలేదని 10 సంవత్సరాలు గడిచిన కూడా తమకు మొండి చెయ్యి ఎదురైందన్నారు. కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో తొలితరం ఉద్యమకారులకు 25 వేల రూపాయల పెన్షన్ సౌకర్యం కల్పిస్తామని 250 గజాల స్థలానికి కేటాయిస్తామని హెల్త్ కార్డు జారీ చేసి బస్సు పాస్ సౌకర్యాన్ని కల్పించాలని ఆయన కోరారు.

ఆమె గెలుపు నేటి యువతకు ఆదర్శం

- రెండుసార్లు ఓడినా మొక్కవోని దీక్షితో గెలిచింది
- ఓడించిన అభ్యర్థిపైన నే అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిచిన తొలి మహిళ

నవతెలంగాణ-కోదాడరూరల్



కోదాడ నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థిగా అత్యధిక మెజార్టీతో గెలిచిన ఆమె గెలుపు నేటి యువతకు ఆదర్శం.రెండుసార్లు కోదాడ హుజూర్నగర్ నియోజకవర్గాలలో ఓడినా మొక్కవోని దీక్షతో ధైర్యంతో తిరిగి మరల కోదాడ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా గెలిచింది. ఓడించిన అభ్యర్థి పైననే అత్యధిక మెజార్టీతో గెలిచింది. ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి న వ తె లం గా ణ కథనం... పద్మావతి రెడ్డి కోదాడ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి తొలి మహిళ పోటీ దారిని 2014 ఎన్నికల్లో 13374 ఓట్ల తేడాతో సమీప ప్రత్యర్థి ని ఓడించి మొదటిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నికయింది ఆ ఎన్నికల్లో పద్మావతి రెడ్డి కి 81966 ఓట్లు రాగా బొల్లం మల్లయ్య యాదవ్ కు 68,592 ఓట్లు వచ్చాయి. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఆమె టిఆర్ఎస్ అభ్యర్థి బొల్లం మల్లయ్య యాదవ్ చేతిలో ఓటమిపాలైంది. హుజూర్నగర్ నియోజకవర్గంలో జరిగిన ఉప ఎన్నికల్లో టిఆర్ఎస్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి చేతిలో ఓటమి పాలయ్యారు. రెండుసార్లు ఓడిపోయినా గాని భయపడకుండా ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో బొల్లం మల్లయ్య యాదవ్ పై గెలిచారు. ఓటమి గెలుపుకు నాంది అయిన నానుడి నిజమైనది. నేటి యువత కూడా ఓటమి తో కృంగిపోకుండా ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి ని ఆదర్శంగా చేసుకుని విజయాలు సాధించాలి అని కోరుకుంటున్నాం.

పదో తరగతి వార్షిక పరీక్షల నామ పట్టికల పరిశీలన

నవతెలంగాణ-నూతనకల్



2023- 24 విద్యా సంవత్సరపు 10వ తరగతి విద్యార్థుల వార్షిక పరీక్షల నామ పట్టికలను శుక్రవారం మండల విద్యాధికారి కార్యాలయంలో పరిశీలనాధికారులు పాఠశాలల వారీగా పరిశీలించారు. నూతనకల్,మద్దిరాల మండలాలకు చెందిన ప్రభుత్వ, ప్రైవేటు, కస్తూరిబా గాంధీ పాఠశాలల విద్యార్థులు మార్చి 2024 లో వార్షిక పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల పూర్తి వివరాలు అంతర్జాలంలో నమోదు చేసిన, ప్రవేశ పుస్తకంలోనీ వివరాలను పరిశీలించి ధ్రువీకరించారు.ఈ సందర్భంగా మండల విద్యాధికారి రాములు నాయక్ మాట్లాడుతూ ప్రవేశ పుస్తకములో ఉన్న విద్యార్థుల వివరాలను తల్లిదండ్రుల ధ్రువీకరణతో అంతర్జాలంలో నమోదు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పరిశీలనాధికారులు డి శివయ్య, భాషిద్,బిక్షం,హరికృష్ణ,రమేష్, సి ఆర్ పిలు జానకి రాములు,వీరస్వామి, లింగస్వామి,రమాకాంత్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు శుభాకాంక్షలు తెలిపిన పటేల్

నవతెలంగాణ-సూర్యాపేట



తెలంగాణ ముఖ్యమంత్రి గా ప్రమాణ స్వీకారం చేసిన ఎనుముల రేవంత్ రెడ్డి ని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేశ్ రెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ గల జూబ్లీహిల్స్ లోని రేవంత్ ని నివాంలో కలిసి ఆయనకు బొకే అందజేశారు.చిన్నప్పటి నుండి క్లాస్ మెంట్స్ గా ఇరువురు కలిసి తిరిగిన జ్ఞాపకాలను ఈ సందర్భంగా వారు గుర్తు చేసుకున్నారు.తన స్నేహితుడు ముఖ్యమంత్రి కావడం గర్వకారణంగా ఉందని రమేష్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి సహకారంతో జిల్లాలో అభివృద్ధి కోసం కృషి చేస్తానని ఆయన తెలిపారు.

అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- సీపీఐ ఎం ఎల్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శికొత్తపల్లి శివకుమార్

నవతెలంగాణ-సూర్యాపేట కలెక్టరేట్

ఐదు రోజుల నుండి తుఫాన్ ప్రభావంతో రాష్ట్రంలో కురుస్తున్న అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐఎంఎల్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం స్థానిక విక్రమ్ భవన్లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో గత ఐదు రోజుల నుండి రాష్ట్రంలో తెగని వర్షాలు కురిసి ప్రజలు అనేక అవస్థలకు గురయ్యారు ముఖ్యంగా రెండు రోజులు ఇంటిలో నుంచి బయటికి రాకుండా వర్షం ఉధృతంగా కురిసిందని, దీని ప్రభావంతో అనేక వేల ఎకరాల్లో పంట నష్టపోయి రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. కొత్తగా వచ్చిన ప్రభుత్వం రైతు ప్రభుత్వం అని చెప్పుకున్నది కావున ప్రభుత్వ తరపున అధికారులతో సర్వే చేయించి పంట నష్టాన్ని తెలుసుకొని ఎకరానికి 50వేల రూపాయలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ని అదేవిధంగా కళ్లాల్లో ఉన్న వడ్లను ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేసి రైతులకు ఇచ్చిన హామీని నిలుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకులు మట్టపల్లి అంజన్న పిడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణుక పిడిఎస్యు జిల్లా కార్యదర్శి ఎర్ర అఖిల్, పాల్గొన్నారు.

తిమ్మాపురం భూ నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలనివినతి

నవతెలంగాణ-భువనగిరిరూరల్

భువనగిరి మండలంలోని బిఎస్ తిమ్మాపురం గ్రామ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం భువనగిరి మాజీ సింగిల్విండో చైర్మెన్ ఎడ్ల సత్తిరెడ్డి, ఎంపీటీసీ ఉడుత శారద ఆంజనేయులు యాదవ్‌లు తెలంగాణ ప్రజాభవన్ లో తొలి ప్రజాధర్బార్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్వాపూర్ రిజర్వాయర్లో ముంపునకు గురవుతున్న బిఎన్ తిమ్మాపూర్‌లో మిగిలిఉన్న పట్టా భూములతో పాటు కబ్జా భూములకు నష్టపరిహారం త్వరగా చెల్లించాలని, మాకు కేటాయించిన హుస్నాబాద్ వద్ద పునరావాస ప్లాట్‌లలో ఇల్లు కట్టుకోవడానికి 10 లక్షలు చెల్లించాలని, ఇప్పటివరకు మా గ్రామంలో 18 ఏండ్లు నిండిన యువతి యువకులకు, బ్రతుకుదెరువు కోసం ఊరు విడిచి వెళ్లిన వారికి కూడా ఆర్అండ్ఆర్ ప్యాకేజి చెల్లించాలని, పునరావాసంలో మౌలిక వసతులు త్వరగా చేపట్టి అభివృద్ధి చేయించాలని కోరగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందిస్తూ మీ ముంపు గ్రామ ప్రజల సమస్యలు త్వరగా పరిష్కారమయ్యేందుకు త్వరగా కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దర్శన్ రెడ్డి, 8వ వార్డు సభ్యులు వళ్లందస్ పరమేష్ కుమార్, వలబోజు నర్సింహ చారి , సుధాకర్ పాల్గొన్నారు.

మంగారెడ్డి మృతి బాధాకరం

నవతెలంగాణ-ఆత్మకూరు(ఎస్)

చింతరెడ్డి మంగారెడ్డి మృతి చాలా బాధాకరమని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ సూర్యాపేట జిల్లా కార్యదర్శి చింతరెడ్డి వీరారెడ్డి అన్నారు. ఆత్మకూరు ఎస్ మండలం ఏపూర్ గ్రామానికి చెందిన చింతరెడ్డి మంగారెడ్డి(56)గుండెపోటుతో మృతి చెందారు . మంగారెడ్డి ఆలేరు మండలం వికృతి జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. ఆయన మృతి పట్ల పలువురు ఉపాధ్యాయులు ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని సంతాపం తెలిపి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో చింత రెడ్డి మోహన్ రెడ్డి, నర్సిరెడ్డి, బొడపట్ల శ్రీను, ఉపాధ్యాయులు నవ తెలంగాణ మోతే విలేకరి బత్తిని వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఘనంగా హజరత్ సయ్యద్ ఖాజానసీరుద్దీన్ బాబా ఉర్సు

నవతెలంగాణ-అర్వపల్లి



హజరత్ సయ్యద్ నసిరుద్దీన్ కాజాబాబా ఉర్సు ఉత్సవం అత్యంత ఘనంగా శుక్రవారం రాత్రి నిర్వహించారు. ముస్లింలు హిందువులు అధిక సంఖ్యలో పాల్గొని స్థానిక పోలీస్ స్టేషన్లో గంధం కు ముస్లింలు ప్రత్యేక ప్రార్థన నిర్వహించారు. గంధమును పోలీసులు నడుచుకుంటూ దర్గా వరకు వెళ్లి బాబాకు సమాధికి గంధమును సమర్పించారు. ముస్లింలు ప్రత్యేక కవాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. సాంప్రదాయ రీతిలో గంధము ఊరేగింపుగా తరలింపు ప్రతి సంవత్సరం మాదిగ ఈ సంవత్సరం గంధమును ముస్లింలు సంప్రదాయం ప్రకారం ప్రత్యేక ప్రార్థన నిర్వహించి అనంతరం పోలీస్ స్టేషన్ నుండి ఎంపీపీ మన్న రేణుక లక్ష్మీ నరసయ్య యాదవ్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు ధరూర్ యోగానందచార్యులు సూర్యాపేట డి.ఎస్.పి నాగభూషణం నాగారం, తుంగతుర్తి సీఐ లు ఎస్సై అంజిరెడ్డి చేతుల మీదుగా గంధం ను ర్యాలీ రూపంలో రెండు కిలోమీటర్ల వరకు నడుచుకుంటూ వెళ్లిసమర్పించారు. పోలీసులు గట్టి బందోబస్తు దర్గా ఉరుసు ఉత్సవం పురస్కరించుకొని స్థానిక పోలీస్ స్టేషన్ నుండి దర్గా వరకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలుజరగకుండా 70 మంది పోలీసులతో గట్టి బందోబస్తు కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు మోరపాక సత్యం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష ఉపాధ్యక్షులు అనిరెడ్డి రాజేందర్ రెడ్డి, నర్సింగ శ్రీనివాస్ గౌడ్, వేల్పులరమేష్ శిగ నసీర్, మాజీ జడ్పీటీసీ కొరపెడత అవిలయ్య, మండల కో ఆప్షన్ సభ్యుడు హమీద్, సయ్యద్ అలీ, సోఫీ, హబీబ్, భీముడు, సైదులు ముస్లిం మత పెద్దలు ప్రజలు భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లోనూ రాణించాలి

- ఎంజీయూ డెవలప్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ మారం వెంకటరమణారెడ్డి

నవతెలంగాణ-నార్కట్‌పల్లి



విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి అని మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం డెవలప్మెంట్ ఆఫీసర్ డాక్టర్ మారం వెంకటరమణారెడ్డి విద్యార్థులకు సూచించారు. ఎంజి యూనివర్సిటీలో శుక్రవారం జరిగిన అంతర కళాశాల క్రాస్ కంట్రీ పోటీలను డా వెంకట రమణారెడ్డి ప్రారంభించారు. వివిధ కళాశాలల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీలను, ఎంజియు ప్రాంగణం నుండి దాసరి గూడెం వరకు వెళ్లి తిరిగి ఎంజియు ప్రాంగణానికి 10 కిలోమీటర్ల పరుగు నిర్వహించారు. ఈ పోటీల్లో పురుషులతో మహిళలు సమానంగా పాల్గొని ప్రతిభ కనబరచడం విశేషంగా ఆకర్షించింది. పోటీల్లో అత్యధికంగా మహిళల భాగస్వామ్యం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ పది కిలోమీటర్ల క్రాస్ కంట్రీలో అత్యుత్తమ ప్రతిభ ఘనపరిచిన ఆరుగురు విద్యార్థిని విద్యార్థులు, మరాఠవాడ, మహారాష్ట్ర, విశ్వవిద్యాలయం వేదికగా జరగనున్న అంతర విశ్వవిద్యాలయాల క్రాస్ కంట్రీ పోటీలలో ఎం జి యు కు ప్రాతినిధ్యం వహించనున్నారు. మహిళ విజేతలు ఎం ఉమ, డి కళ్యాణి :గౌతమి కళాశాల సూర్యాపేట షహనాస్, శివప్రియ, మహేశ్వరి, స్నేహలత సోషల్ వెల్ఫేర్ ఆర్ట్స్ మహిళా కళాశాల బోనగిరి, కళ్యాణి, శ్రీ కృష్ణ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్,కే పావని, సోషల్ వెల్ఫేర్ కళాశాల దేవరకొండ, ఆలోకిత సోషల్ వెల్ఫేర్ డిగ్రీ కళాశాల సూర్యాపేట మహిళ విభాగంలో ఓవర్ ఆల్ ఛాంపియన్‌గా సోషల్ వెల్ఫేర్ అర్ముడు డిగ్రీ కళాశాల భువనగిరి వారు నిలిచారు.

పురుషుల విభాగంలో..

ఎస్ అఖిల్ కుమార్, జాన్ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ వి ధనుష్, ముఖేష్ రాకేష్, రవీందర్ ఎన్జీ కళాశాల, లింగస్వామి, ప్రసాద్ ప్రభుత్వ కళాశాల రామన్నపేట, హుజూర్నగర్, వి సైనిక్, బి సిద్దు ఎస్ఎల్ఎన్ఎస్ డిగ్రీ కళాశాల భువనగిరి ఉత్తమ ప్రతిభను కనపరిచారు. పురుషుల విభాగంలో ఎన్ జి కళాశాల నల్లగొండ విద్యార్థులు ఓవర్ ఆల్ ఛాంపియన్‌గా నిలిచారు. పోటీల అనంతరం గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు పథకాలను, షీల్డులు అందజేశారు.

మనోజ్ కొంచెం.. పరుగు గణం..

పది కిలోమీటర్ల పరుగు పందెంలో 8వ తరగతి చదువుతున్న మనోజ్ పాల్గొని ఉత్తమ ప్రతిభను కనబరిచి అందరిని ఆకర్షించారు. నల్లగొండ జిల్లా ముకుందాపురం గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబం నుండి వచ్చిన మనోజ్ పాఠశాల స్థాయిలో అందరి దృష్టిని ఆకర్షించి మన్ననలు పొందాడు. అతని ప్రతిభను గుర్తించిన ఉపాధ్యాయులు, స్థానిక క్రీడాకారులు అతనిని ప్రోత్సహించి తమతో పాటుగా మనోజ్ కు సైతం శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. మంచి పౌష్టిక ఆహారం సైతం తమ వంతుగా అందిస్తున్నట్లు క్రీడాకారులు నిఖిల్, ధనుష్ తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన బాలుడిని ప్రభుత్వం గుర్తించి మంచి శిక్షణ, సహకారం అందించడం ద్వారా దేశానికి ఒక మంచి క్రీడాకారుడిని మన ప్రాంతం నుండి అందించవచ్చునని పలువురు పిడీలు అభిప్రాయపడ్డారు. 10 కిలోమీటర్ల క్రాస్ కంట్రీని సునాయాసంగా అలసట లేకుండా పూర్తి చేయడం స్థానికులను ఎంతగానో ఆకర్షించింది. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ సెక్రటరీ డా ఉపేందర్ రెడ్డి, డా మురళి, కడారి మల్లేష్, వివిధ కళాశాలల పిడిలు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

కోదాడ కళాకారునికి నంది పురస్కారం

నవతెలంగాణ-కోదాడరూరల్



కోదాడ ప్రాంతానికి చెందిన కళాకారుడు, లఘు చిత్ర డైరెక్టర్ తిరుప్ ఏర్పుల ప్రతిష్టాత్మకమైన నంది అవార్డు పురస్కారం శుక్రవారం దక్కింది. గత మూడు సంవత్సరాల నుండి సమాజాన్ని చైతన్య పరిచే విధంగా సందేశాత్మక లఘుచిత్రాలు నిర్మిస్తూ ఎంతోమంది కళాకారులను ప్రోత్సహిస్తూ కళా రంగానికి అతను చేస్తున్న సేవలను గుర్తించి తెలంగాణ భాష సంస్కృతిక శాఖ సౌజన్యంతో హైదరాబాదులోని రవీంద్ర భారతిలో నిర్వహించిన కార్యక్రమంలో కళాకారుల సంఘం జాతీయ అధ్యక్షుడు జంగయ్య గౌడ్ ఆధ్వర్యంలో నంది అవార్డు పురస్కారపత్రం, జ్ఞాపిక అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. వారికి అవార్డు వచ్చిన సందర్భంగా కళాకారుల సంఘం సూర్యాపేట జిల్లా అధ్యక్షులు కంబాల. శ్రీనివాస్ నాయుడు,కోదాడ పట్టణ అధ్యక్షులు తిరుమలగిరి రాధాకృష్ణ తో పాటు పలువురు సినీ ప్రముఖులు అభినందనలు తెలిపి ఘనంగా సన్మానించారు.

ఘనంగా మదర్ సాహెబ్ ఉర్సు
నవతెలంగాణ-ఆలేరుటౌన్



ఆస్థాన హజరత్ సయ్యద్ అహ్మద్ బదియుద్దీన్ పీర్ కుత్బుల్ జిందాషా మదర్ సాహెబ్ ఉరుసూ ఉత్సవాలు ఘనంగా భక్తుల సమక్షంలో శుక్రవారం నిర్వహించారు. గంధం ఊరేగింపు గా కాటమయ్య నగర్‌లోని మదర్, బీజన మదుకుమార్ ఇంటి నుండి, రామసముద్రం బైపాస్ రోడ్డులో దర్గా వరకు నిర్వహించారు. గంధం ఊరేగింపు అనంతరం సాయంత్రం దాంబాల్ కార్యక్రమం నిర్వహించరు. ఆలేరు మాజీ శాసనసభ్యులు బూడిద బిక్షమయ్య, వివిధ ప్రాంతాల నుండి భక్తులు హాజరై గంధం ఊరేగింపులో పాల్గొన్నారు. కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుండి మదార్సలు హాజరై పూజలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

భువనగిరి ఎమ్మెల్యేను కలిసిన సుప్రీం యాదవ్
నవతెలంగాణ-భువనగిరిరూరల్



భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డిని శుక్రవారం హైదరాబాదులోని ఆయన నివాసంలో వాడయి గూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు శెట్టి (సుప్రీమ్) యాదగిరి యాదవ్, మరో ముగ్గురు తో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించి, ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతోపాటు ఎమ్మెల్యే ని కలిసిన వారిలో భువనగిరి మండల సమైక్య కార్యదర్శులు గంగాదేవి రవి, ఎరుకల రాజు గౌడ్, శోకం రాజశేఖర్ ఉన్నారు.

ఆరోగ్యశ్రీ పరిమితి రూ. 10 లక్షల పెంపుపై హర్షం

ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన చికిత్స అందించాలి

మాతా శిశు సంరక్షణ కోసం ప్రత్యేక వైద్యశాలను ఏర్పాటు చేయాలి

హాస్పిటల్స్ స్థాయి పెంపొందించాలి

నవతెలంగాణ-భువనగిరి

రాష్ట్రంలో నెలకొన్న రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వం ఆరోగ్య శ్రీ పరిమితి రూ. 10 లక్షల పెంపుపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఎన్నికల హామీల లో భాగంగా జిల్లా కేంద్ర వైద్యశాలలు కెపాసిటీ పెంపు సిబ్బంది నియామకాలు అన్ని రకాల మందులు ఇచ్చే విధంగా కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు. కొన్ని వైద్యశాలలు ఆరోగ్యశ్రీ కింద తీసుకోవడం లేదని ప్రభుత్వం వారికి రుణాలు బకాయిలు ఉన్నాయని, వారు తిప్పుకుంటున్నారని ప్రజలు తెలుపుతున్నారు. వాటిని అన్ని సరిచేసి ప్రజలకు అవసరమయ్యే విధంగా ఆరోగ్యశ్రీ వర్తింపజేయాలని కోరుతున్నారు. రాష్ట్రంలో నూతన కాంగ్రెస్ ప్రభుత్వం అమల్లోకి రావడం ఆరు గారెంటీలలో ఒకటైన ఆరోగ్యశ్రీ పెంపు పట్ల ప్రజల్లో ఆసక్తి కనబడుతుంది. ఈనెల తొమ్మిదిన సోనియా గాంధీ జన్మదిన పురస్కరించుకొని రాష్ట్రంలో మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం, రెండవ ఫైల్ ఆరోగ్యశ్రీ సంతకం చేస్తారన్న ప్రకటన అందరికీ తెలిసిందే. ఆరోగ్యశ్రీ కింద గుర్తించబడిన వ్యాధుల కోసం 31 వర్గాలలో 3255 జాబితాలలో ఉన్నాయి. కార్డియాలజీ, కార్డియాక్, కార్డియోథొరాసిక్ సర్జరీ, కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీ, న్యూరాలజీ, న్యూరోసర్జరీ, నెఫ్రాలజీ, ఈఎన్టీ సర్జరీ, గ్యాస్ట్రోఎంటరాలజీ, జెనిటో యూరినరీ సర్జరీలు, గైనకాలజీ మరియు ప్రసూతి శస్త్రచికిత్స, సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ, రుమటాలజీ, ఆర్థోపెడిక్ సర్జరీ మరియు ప్రొసీజర్స్, ఆప్తాల్మాలజీ సర్జరీ,అవయవ మార్పిడి శస్త్రచికిత్స, పీడియాట్రిక్స్, పీడియాట్రిక్ సర్జరీ, పల్మోనాలజీ, రేడియేషన్ ఆంకాలజీ, సర్జికల్



ఆంకాలజీ, , మెడికల్ ఆంకాలజీ, క్లిష్టమైన సంరక్షణ, డెర్మటాలజీ, ఎండోక్రినాలజీ, సాధారణ శస్త్రచికిత్స, జనరల్ మెడిసిన్స్, చర్మానికి సంబంధించిన శస్త్రచికిత్స, పాలీ ట్రామా, మనోరోగచికిత్స, కేన్సర్‌లు, కాలిన గాయాలు, ప్రమాదాలు మరియు గుండె, మెదడు, కిడ్నీలు, శ్వాసకోశ వ్యవస్థ, జీర్ణకోశ వ్యవస్థ, మస్క్యులోస్కెలెటల్ వ్యవస్థ మొదలైన వాటికి సంబంధించిన పరిస్థితులను కవర్ చేస్తుంది.

ప్రభుత్వ వైద్యశాలలు మెరుగుపరచాలి.

రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లోని వైద్యశాలలో సేవలు మెరుగుపరచాలని కోరుతున్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు జిల్లా కేంద్ర వైద్యశాలలను సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ గా మారుస్తామన్న హామీని నిలబెట్టుకోవాలని కోరుతున్నారు. ప్రస్తుతం ఉన్న వైద్యశాలలో మౌలిక సదుపాయాలు అర్హత కలిగిన సిబ్బంది నియామకం. నాణ్యమైన మందులు అందించాలని కోరుతున్నారు. జనరిక్ మందుల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరుతున్నారు.

దవాఖానాల సంఖ్య పెంచాలి

జిల్లాలో 2000 జనాభాకు ఒక బస్తీ, గ్రామ దవాఖానాలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. 24 గంటల వైద్య సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఫార్మా డి, నర్సింగ్ కళాశాలలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

జిల్లా కేంద్రంలో ప్రత్యేక చిన్న పిల్లల వైద్యశాల ఏర్పాటు చేయాలి.

మాత శిశు సంరక్షణ కోసం జిల్లా కేంద్రంలో ప్రసూతి, చిన్న పిల్లల కోసం ప్రత్యేకమైన వైద్యశాల ఏర్పాటు చేస్తామని గత ప్రభుత్వం హామీ ఇచ్చి, వార్డు కేటాయింపుతో సరిపెట్టుకుంది . వాటిలోసరైన సిబ్బంది లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. నూతన ప్రభుత్వం మాత శిష్యుల సంరక్షణ కోసం అధునాతనమైన సౌకర్యాలతో సిబ్బందితో ప్రత్యేకమైన వైద్యశాలను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మీ బిడ్డగా ఆశీర్వదించారు.. ఆలేరును అభివృద్ధి చేస్తా

- ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

నవతెలంగాణ-ఆలేరుటౌన్



'నియోజకవర్గ ప్రజలు మీ బిడ్డగా ఓట్లేసి ఆశీర్వదించారు.. ఆలేరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేస్తానని ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. శుక్రవారం ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో లో ప్రజలకు ఇచ్చిన హామీలు , ఆరు గ్యారంటీ స్కీములు ప్రతి గడపగడపకు అందేలా చూస్తానని పేర్కొన్నారు. ఆలేరు ప్రజలు మార్పు కోరుకున్నారని, తెలంగాణ రాష్ట్ర మిచ్చిన తల్లి సోనియా గాంధీ అని , ఆమె రుణం తీర్చుకుంటామన్నారు. ఆలేరు ప్రజల ఆశీస్సులు చరిత్రలో లిఖించే విధంగా 50 వేల ఓట్ల మెజార్టీ తనకు అందించారని, ఇంత పెద్ద ఆదరణ ని తాను కలలో కూడా ఊహించలేదన్నారు. ఆలేరు నియోజకవర్గం ప్రజలు సేవ చేసేందుకు తనకు ఒక అవకాశం ఇచ్చారని, సేవ చేస్తానని గ్రామ గ్రామాన, గడప గడపకు మాటిచ్చానని, కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన 6 గ్యారంటీ స్కీములు, శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి సాక్షిగా అమలు చేస్తానని చెప్పారు. ప్రజలు తనకు మెజార్టీ ఇచ్చినందుకు గర్వపడుతున్ననని చెప్పారు. గతంలో వచ్చిన మెజార్టీల కంటేజిల్లా, రాష్ట్రంలోనే రికార్డు స్థాయిలో 50వేల మెజార్టీ వచ్చిందని,అలేరు ప్రజల ఆశీర్వాదంగా భావిస్తున్నానన్నారు. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు కంకన బద్దున్నయి పనిచేస్తానన్నారు. రానున్న రోజులలో బీర్ల ఫౌండేషన్ ద్వారా నియోజకవర్గంలోని మండల కేంద్రాలలో అంబిలైన్సులు ఏర్పాటు చేస్తూ , గ్రామాలలో మరింత విస్తృతంగ సేవలు అందిస్తానన్నారు. నాకు ఇంత గొప్ప అవకాశం కల్పించిన నియోజకవర్గ ప్రజలకు ,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ప్రజలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నానన్నారు.

మంత్రిని కలిసిన కాంగ్రెస్ జిల్లా నాయకులు

నవతెలంగాణ -బీబీనగర్



నలగొండ ఎమ్మెల్యేగా గెలుపొంది తెలంగాణ రాష్ట్ర క్యాబినెట్ లో మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన కోమటిరెడ్డి వెంకటరెడ్డి ని శుక్రవారం జిల్లా కాంగ్రెస్ నాయకులు పొట్టోళ్ల శ్యామ్ గౌడ్ హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సందర్భంగా శాలువాలతో సన్మానించి స్వీట్స్ తినిపించారు. అనంతరం శ్యామ్ గౌడ్ మాట్లాడుతూ మంత్రిని బీబీనగర్ ప్రాంత అభివృద్ధికి సహకరించాలని కోరినట్లు తెలిపారు. ఆయన వెంట గూడూరు సర్పంచి గడ్డం బాల్ రెడ్డి, నాయకులు అశోక్ రెడ్డి, సంజీవరెడ్డి, గడ్డం బాలకృష్ణ గౌడ్, తదితరులు ఉన్నారు.

మంత్రికి, ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపిన ప్రజాప్రతినిధులు, నాయకులు



రామన్నపేట : నూతనంగా మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ని, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశమును శుక్రవారం హైదరాబాదులోని న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్ లో మండల ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకొని శుభాకాంక్షలు తెలిపారు. వీరేశం అభిమాని వంగల అవినాష్ తిరుపతికి వెళ్లి వేముల వీరేశం ఎమ్మెల్యేగా గెలిచినందున తల నీలాలిచ్చి మొక్కు తీర్చుకొని, దేవుని ప్రసాదాన్ని ఎమ్మెల్యే వేముల వీరేశంకు అందజేశారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో రామన్నపేట జెడ్పీటీసీ పున్న లక్ష్మీ జగన్మోహన్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు సిరిగిరెడ్డి మల్లారెడ్డి, మదర్ డెయిరీ మాజీ చైర్మన్ గంగుల కృష్ణారెడ్డి, రామన్నపేట సర్పంచ్ ఫోరం అధ్యక్షులు, నిదాన్ పల్లి గ్రామ సర్పంచ్ గుత్తా నరసింహారెడ్డి, మాజీ మండల అధ్యక్షులు గంగుల రాజి రెడ్డి, మాజీ జడ్పీటీసీ జినుకల ప్రభాకర్, వెల్లంకి ఎంపీటీసీ తిమ్మాపురం మహేందర్ రెడ్డి, నాయకులు మండడి రవీందర్ రెడ్డి, పున్న రమేష్, శంభాల వెంకటేష్, నల్ల వెంకట్ రెడ్డి, ఫైళ్ల వెంకట్ రెడ్డి, ఎండి జమీరుద్దీన్, తదితరులు ఉన్నారు.

ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా అన్ని రైళ్లనూ నిలపాలి

- పద్మావతి, చార్మినార్ ఎక్స్ప్రెస్ రైల్ లను నిలిపేందుకు చర్యలు తీసుకోవాలి

బర్రె జహంగీర్

నవతెలంగాణ - భువనగిరి



ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్లో అన్ని రైలులను నిలపాలని మున్సిపల్ మాజీ చైర్మన్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజన్ రైల్వే యూజర్స్ (డి ఆర్ యు సి సి) 169 సభ్యులతో హైదరాబాద్ నగరంలోని డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సికింద్రాబాద్ డివిజన్‌లోని డివిజనల్ రైల్వే మేనేజర్ ని కలిసి భువనగిరి రైల్వేస్టేషన్ మీదుగా ప్రయాణించే పాసింజర్ సర్వీసుల మెరుగుదలకు సంబంధించిన పలు అంశాలపై ఆయన చర్చించారు. భువనగిరి నుండి హైదరాబాద్ ప్రయాణికులకు ఇబ్బందుల మేరకు రోజువారి ప్రయాణికుల సమస్యలను తెలిపారు భువనగిరి రైల్వేస్టేషన్‌లో కొన్ని రైళ్ళు ఆపటం వల్ల భువనగిరి ప్రజలకు కలిగే ప్రయోజనాలు గురించి వివరించారు. భువనగిరి నుండి సికింద్రాబాద్ తిరుగుప్రయాణం ప్రకారం భువనగిరి లో నాందేడ్ ఎక్స్‌ప్రెస్, చార్మినార్ ఎక్స్‌ప్రెస్, పద్మావతి ఎక్స్‌ప్రెస్ తదితర ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలిపినట్లైతే ప్రయాణికుల సమస్య తీరుతుందని తెలిపారు. రైల్వే ప్రయాణికుల భద్రత, భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, సికింద్రాబాద్ డివిజన్ అభివృద్ధి, రైలు వినియోగదారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కట్టుబడి ఉన్నామని మేనేజర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. సికింద్రాబాద్ డీఆర్ఎమ్ భరణీష్ కుమార్ జైన్,ఇంకా రైల్వేఉన్నతాధికారులు భువనగిరి ప్రజలకి ట్రిబుల్ లైన్ ఘట్‌కేసర్ నుండి ఖాజీపేట వరకు మంజూరైందని, త్వరలోనే ఎంఎంటీఎస్ యాదాద్రి వరకు స్టార్ట్ చేస్తామన్నారు ,సీనియర్ సిటిజన్ కు ఇబ్బందులు లేకుండా లిఫ్ట్,ఫుట్ పాత్ ఏర్పాటు చేయాలని కోరగా డిఆర్ఎం ఇచ్చితంగా సభ్యుల సూచన మేరకు ప్రతి పాదానులు సిద్దంచేసి మంజూరు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌యూసీసీ మెంబర్స్ రైల్వే కమ్యూటర్స్ నుండి శివప్రసాద్, సభ్యులు రైల్వే ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

నేడు ఉచిత మెడికల్ క్యాంప్
నవతెలంగాణ-రాజాపేట

రాజపేట మండలం రఘునాథపురం గ్రామంలో నేడు సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఉచిత మెడికల్ క్యాంపు మల్లారెడ్డి, నారాయణ ఆసుపత్రి ఎం.డి, చైర్మన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు రఘునాథపురం గ్రామ సర్పంచ్ గాడిపెల్లి శ్రవణ్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెడికల్ క్యాంపు ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 2:00 గంటల వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ క్యాంపులో ఉచిత బీపీ, షుగర్, పరీక్షలు చేసి ఉచితంగానే డాక్టర్ సంప్రదింపులు జరుగుతాయి. అని ఆ తరవాత వారికి సంబంధించిన మోకాళ్ళనొప్పులు, నడుము నొప్పులు,దగ్గు, దమ్ము, జ్వరం, ఆయాసం,తలనొప్పి,ఆకలి లేకపోవడం,సర్ది, దురద, బలహీనమందులు,చిన్నపిల్లలకి మరియు రక్తం తక్కువగా ఉన్న వారికి మందులు కూడా ఉచితంగా ఇస్తారు తెలిపారు. ఎంఆర్ఐ, స్కానింగ్ లు, ఆపరేషన్ లు ఉన్న కూడా వారిని ఎంపిక చేసి ఆసుపత్రికి తీసుకెళ్లి ఉచితంగానే చేస్తారని తెలిపారు.. ఈఅవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రాష్ట్ర స్థాయి క్రీడా మేళాకు సర్వం సిద్ధం
నవతెలంగాణ-రాజాపేట

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ 9వ రాష్ట్రస్థాయి క్రీడలు బాలుర విభాగంలో ఈ నెల9 నుండి 12 వరకు రాజాపేటలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల,కళాశాలలో పోటీలను నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలోని ఏడు జోన్లకు సంబంధించిన 1171 మంది విద్యార్థులు ఏడు విభాగాలలో అనగా కబడ్డీ, వాలీబాల్, ఫుట్ బాల్,ఖోఖో బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, క్యారమ్స్,చెస్ క్రీడలలో నిర్వహించనున్నారు. ఈ క్రీడల నిర్వహణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు చేసినట్లు యాదాద్రి ఆర్ సీఓ, క్రీడల ఓవరల్ ఇంచార్జ్ ఎన్.రజని ఒక ప్రకటనలో తెలిపారు.

ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు మంత్రి పదవి ఇవ్వాలి
నవతెలంగాణ- ఆలేరుటౌన్



ఆలేరు నియోజ కవర్గంలో 50 వేల మెజారిటీ ఓట్లతో విజయాన్ని సాధించిన బీర్ల ఐలయ్యకు సీఎం రేవంత్ రెడ్డి మంత్రి పదవి ఇవ్వాలి , బదుగు బలహీన వర్గాల అభ్యున్నతిగా గౌరవించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, ఎగ్గిడి మల్లయ్య శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు.ఎన్నికైన రాష్ట్ర మంత్రివర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి పదవి ఇవ్వడం ద్వారా వెనుకబడినయాదాద్రి భువనగిరి జిల్లా అన్ని రంగాల్లోనూ అభివృద్ధి సాధిస్తుందన్నారు.

అయ్యప్పస్వాములు ఇరుముడి మహోత్సవం
నవతెలంగాణ-బొమ్మలరామారం

మండలంలోని మర్యాల గ్రామంలో శుక్రవారం శివాలయం వద్ద తోట వెంకటేష్ గురుస్వామి, గురువుల గురుస్వామి ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా ఇరుముడి మహోత్సవం కార్యక్రమం జరిగింది.అయ్యప్ప స్వాములు శరణు ఘోషలు, సంకీర్తనలతో ఆలయ ప్రాంగణం మారుమోగింది.15మంది అయ్యప్ప స్వాములకు ఇరుముడి కట్టించుకుని శబరి యాత్రకు బయలుదేరారు.అనంతరం భక్తులు అయ్యప్ప స్వాములు తీర్థప్రసాదాలు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు ఈదులకంటి జంగారెడ్డి,దొడ్డి భాస్కర్,మేకల కుమార్, బండ శ్రీధర్,మహేష్,శివ,శేఖర్,బాల్, గంగిశెట్టి చంద్రశేఖర్, మల్లికార్జున్, శ్రీకాంత్,రాజు, ప్రేమ్ కుమార్ తదితర స్వాములు పాల్గొన్నారు.

ఘనంగా ఏకాదశి నగర సంకీర్తన
నవతెలంగాణ-రాజాపేట

రాజపేట మండలం రఘునాథపురం గ్రామంలో మర్యుక శ్రీ శ్రీ శ్రీ రవిచర భావనంద భారతి స్వామి వారి అనుగ్రహంతో శ్రీ విశ్వనాథ గురుదేవుల ఆశీస్సులతో ఆదరాసు శ్రీధర శర్మ వ్యవస్థాపకులుగా పొందనుగా ఆశ్రమం కేంద్రంగా శతకోటి హరే రామ నామ జప యజ్ఞం పురస్కరించుకొని గ్రామ గ్రామానికి జరుగుతున్న ఏకాదశ నగర సంకీర్తనలో భాగంగా రఘునాథపురం భగవత్ సేవా సమాజం శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కార్తీక మాసం బహుళ పక్షం ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం నుండి రామాలయం ప్రధాన వీధుల గుండా శివాలయం వరకు శివాలయం నుండి చిన్న గౌరాయపల్లి ప్రధాన వీధుల గుండా వెంకటేశ్వర స్వామి ఆలయం వరకు అత్యంత వైభవంగా హరే రామ నామ సంకీర్తన చేయడం జరిగింది. భక్తులందరూ అధిక సంఖ్యలో పాల్గొని అద్భుతంగా హరే రామ నామ నగర సంకీర్తన నిర్వహించి భగవన్నామం ప్రచారం గావించడం జరిగినది ఈ కార్యక్రమంలో చిలక లక్ష్మీనారాయణ దంపతులు, వల్లకటి బాబురావు ,సామల భాస్కర్ , బొడ్డుల వెంకటేశం బింగి శివరాజ్ , కటకం సంతోష్ ,వేన్న బాల సిద్దులు, కటకం శ్రీనివాస్, బెజాగం ఆత్మలింగం ,విజ్జిల ఈశ్వర్ ,ఉప్పల రమేష్, చెట్టుపల్లి శ్రీధర్ ,దుదుక బాలరాజ్ ,బింగి అశోక్, రేగొండ వెంకటేశం, చిప్ప సుదర్శన్ మహేశ్వరం చంద్రమౌళి, బిజ్జల నరసింహులు ,బొమ్మ వెంకటేశం, బల్ల వివేక్, కొండ సురేష్ ,బొడ్డు పాండరి,బల్ల నాగభూషణం,ఆడెపు శివ ,వేన్న నరసింహులు ,లోక శ్రీనివాస్, సామల గౌతమ కృష్ణసామల రమేష్, భక్తులు పాల్గొన్నారు.



మల్లారెడ్డి నారాయణ ఆసుపత్రి
ఉచిత వైద్య సేవలు

నవతెలంగాణ-ఆలేరుటౌన్

ఆలేరు మండలం శ్రీనివాసపురం గ్రామంలో శుక్రవారం మల్లారెడ్డి , నారాయణ ఆసుపత్రి ఉచిత వైద్య సేవలు, సర్పంచ్ వద్ద నవ్య శోభన్ బాబు హాజరై ప్రారంభించారు. ఉదయం 10:30నుండి మధ్యాహ్నం వరకు గ్రామ పంచాయతీలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. మెడికల్ క్యాంపులో బీపీ, షుగర్, పరీక్షలు డాక్టర్ నిర్వహించి పేషెంట్లకు తగు సూచనలు చేశారు. మోకాళ్ళనొప్పులకు, నడుము నొప్పులు,దగ్గు, దమ్ము, జ్వరం, నడుము నొప్పి, ఆయాసం, తలనొప్పి, ఆకలి లేకపోవడం, సర్ది, దురద, బలహీనమందులు, చిన్నపిల్లలకి మరియు రక్తం తక్కువగా ఉన్న వారికి మందులు ఉచితంగా అందజేశారు. రక్త పరీక్షలు, ఎక్సరేలు, స్కానింగ్ లు బలహీనమందులు, సిటీ స్కానింగ్, మెదడు, మోకాళ్లకు, నడుముకి ఎంఆర్ఐ స్కానింగ్ లు, ఆపరేషన్ లు అవసరమైనా వారిని ఎంపిక చేసి ఆసుపత్రికి తీసుకెళ్లి ఉచితంగానే చేస్తారని డాక్టర్ల క్యాంప్ బృందం సభ్యులు తెలిపారు.

విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం
నవతెలంగాణ-వలిగొండరూరల్

మండలంలోని అరూరు గ్రామంలో బద్దం రామకృష్ణారెడ్డి కాలనీలో బద్దం చంద్ర శేఖర్ రెడ్డి సౌజన్యంతో నిర్మించిన శ్రీ మహాలింగేశ్వర ఆలయంలో పెద్దిటి సత్తిరెడ్డి సౌజన్యంతో ఏర్పాటు చేసిన విగ్రహాలను శుక్రవారం ఘనపతి, సుబ్రహ్మణ్య స్వామి, నవగ్రహ విగ్రహాలను సిద్ధాంత కాల్పూర్వ బేతోజు సత్యనారాయణ శాస్త్రి బృందం వారిచే ప్రతిష్టాపన కార్యక్రమం చేశారు. అంతకు ముందు ధనపతి పూజ,మోహినీ క్షేత్ర పాలకులకు వాస్తు పూజ, మండల పూజలు, జలాదివాసం, ధాన్యాది వాసం, పుష్పాది వాసం మొదలగు పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బద్దం చేతన్ రెడ్డి, చందన్ రెడ్డి, తుమ్మల రవీందర్ రెడ్డి, ఫైళ్ల బుషి రెడ్డి, సాయి కిరణ్ రెడ్డి, మోదాల వెంకటేష్, చిన్న వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత ప్రయాణం అమలు పట్ల హర్షం
నవతెలంగాణ-ఆలేరుటౌన్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో, కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారంటీ పథకాల అమలులో భాగంగా, కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకురాలు సోనియాగాంధీ జన్మదినం పురస్కరించుకొని, రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయడం పట్ల , కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ మహిళా నాయకురాలు, జాలపు వనజ రామ్ రెడ్డి శుక్రవారం హర్షం వ్యక్తం చేస్తూ, ఒక ప్రకటన చేశారు. మహిళలకు,విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణం ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. చిత్తశుద్ధితో ప్రభుత్వం పథకాల అమలు చేస్తుందని, కాంగ్రెస్ ప్రభుత్వ సేవల గురించి కొనియాడారు.

పాఠశాలకు ఎల్ఈడి టీవీ బహూకరణ
నవతెలంగాణ-భువనగిరిరూరల్



భువనగిరి మండలంలోని బండ సోమవారం గ్రామంలోని ప్రైమరీ స్కూల్ కు దత్తాత్రేయ ఫౌండేషన్ వ్యవస్థాపకులు గుండేటి విజయ దత్తాత్రేయ శుక్రవారం ఎల్ఈడి టీవీని బహూకరించి, ఇంటర్నెట్ కోసం వైఫై సౌకర్యం కల్పించినట్లు ఆ గ్రామ సర్పంచ్ నాగం వెంకటేష్ కృష్ణ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థుల సౌకర్యార్థం వారికి పూర్తి స్థాయిలో ఇంగ్లీష్ మీడియం స్థాపించి స్కూల్ ని వాలంటీర్ పెట్టి నడిపిస్తు విద్యార్థులకు డిజిటల్ క్లాస్ కోసం 32 ఇంచుల ఎల్ఈడి టీవీ తో పాటుగా వైఫై సౌకర్యం తో విద్యార్థులు డిజిటల్ క్లాసులు వినునున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ యాట రమేష్, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు మచ్చ అంజనేయులు ఎస్ఎంసి చైర్మన్ రామకృష్ణ,గ్రామశాఖ అధ్యక్షులు మజ్జిగ కుమార్ కోఆప్షన్ సభ్యులు ఎర్రం నర్సయ్య, చెరుకుని గౌరయ్య, దసరాపు నర్సింహా ఉపాధ్యాయులు వెంకటేష్, మొక్క , రఘు ,భానుప్రసాద్ పాల్గొన్నారు.



వివాహ వేడుకకు హాజరైన ప్రముఖులు
నవతెలంగాణ-ఆలేరుటౌన్

మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా, అవుషాపూర్ లోని పి.పి.ఆర్ కన్వెన్షన్ లో శుక్రవారం మోటకొండూర్ మండల జడ్పీటీసీ పల్లా వెంకట్ రెడ్డి కుతూరు వివాహ వేడుక కి, ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర బెవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్య గౌడ్ ,రాష్ట్ర నాయకులు కల్లూరి రామచంద్ర రెడ్డి, సుడా గాని హరి శంకర్ గౌడ్ , మదర్ డెయిరీ చైర్మన్, లింగాల శ్రీకర్ రెడ్డి , టి పి సి సి రాష్ట్ర కార్యదర్శి, జనగామ ఉపేందర్ రెడ్డి హాజరై నూతన వధూవరులను అక్షింతలతో ఆశీర్వదించారు. పూల బొకే అందజేసి వివాహ మహోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన వధూవరులను ఆశీర్వదించిన వారిలో ఆలేరు మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య, బి ఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు, పుట్ట మల్లేష్, పిఎసిఎస్ చైర్మన్, మొగులగాని మల్లేష్, మాజీ సర్పంచులు రాంగోపాల్ రెడ్డి, సీసా బాలరాజు, తదితరులు ఉన్నారు.

శ్రీ వెంకటేశ్వర ఆలయంలో విశేష పూజలు
నవతెలంగాణ-వలిగొండరూరల్

మండలంలోని సంగెంలో ప్రవాస భారతీయులు పైళ్ల మల్లా రెడ్డి సాధన దంపతుల సౌజన్యం తో నిర్మించిన ఆలయ సముదాయంలో 26 వ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం విష్వక్సేన పూజ,పుణ్యాహవచనం, రుత్విక్వరణం, రక్షాబంధనం, అంకురార్పణ,నివేదన, తీర్థ ప్రసాద గోష్ఠి మొదలగు పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఈ నెల 10 వ తేదిన నిర్వహించనున్న కళ్యాణ మహోత్సవానికి మున్సిపల్ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ని, జిల్లా పరిషత్ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి ని, స్థానిక శాసన సభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ని, మాజీ శాసన సభ్యులు పైళ్ల శేఖర్ రెడ్డి ని ఆలయ కమిటీ చైర్మన్ పైళ్ల ఉపేందర్ రెడ్డి కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు,శ్రీ వెంకటేశ్వర స్వామి సాంఘిక సేవా సమితి సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



అందుబాటులోకి ఆక్సిజన్ పీల్చే యంత్రం



నవతెలంగాణ-చిట్యాలటౌన్

ఆక్సిజన్ అవసరం ఉన్న పేదవారికి ఉచితంగా ఆక్సిజన్ పీల్చే యంత్రమును రోటరీ క్లబ్ సంస్థ అందుబాటులోకి తీసుకువచ్చింది. చిట్యాల రోటరీ క్లబ్ అధ్యక్షులు, మాజీ ఎంపీటీసీ గుండెబోయిన సైదులు ఆధ్వర్యంలో అనారోగ్యంతో ఉన్నవారికి ఆక్సిజన్ శ్వాస ఇచ్చే యంత్రాన్ని శుక్రవారం అందుబాటులోకి తీసుకువచ్చామని అన్నారు. ఈ సందర్భంగా గుండెబోయిన సైదులు మాట్లాడుతూ ఈ మిషన్ను ఐబీఎన్ సంస్థవారు డొనేట్ చేశారని తెలిపారు. ఎలాంటి రుసుము లేకుండా ఆక్సిజన్ అవసరం ఉన్న పేదలు వాడుకున్న తర్వాత మిషన్‌ను మళ్లీ సంస్థకు తిరిగి ఇవ్వవలెనని తెలిపారు. కుట్టు మిషన్లు, చదువుకునే మహిళలకు సైకిల్స్ రోటరీ క్లబ్ ద్వారా ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షులు మందడి జనార్దన్ రెడ్డి, కోశాధికారి ఎడ్ల శ్రీశైలం, సహాయ కార్యదర్శులు జంగిల్ సైదులు, కమ్మల పెళ్లి సత్యనారాయణ, గాలి యాదగిరి రాజు, నల్ల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ డ్రయినేజ్ పనులను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్



నవతెలంగాణ-చిట్యాలటౌన్

చిట్యాల మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డులో జరుగుతున్న సిసి రోడ్డు పనులను, 12వ వార్డులో జరుగుతున్న ఓపెన్ డ్రైనేజీ పనులను పరిశీలించారు. జరుగుతున్న పనులలో నాణ్యత పాటించాలని, మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చిన్న వెంకటరెడ్డి అక్కడున్న కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ రెముడాల లింగస్వామి, సిపిఐ ఎం నాయకులు శీల కాంగ్రెస్ నాయకులు గంట శ్రీనివాస్ రెడ్డి, జిట్ట చంద్రకాంత్, కోమటిరెడ్డి అమరేందర్ రెడ్డి, కొమిడాల నర్సిరెడ్డి, ఎడ్ల సతీష్, జడల ఎల్లయ్య,గాలి యాదగిరి, నూనె శ్రీను, సామ రామకృష్ణారెడ్డి,రేముడాల యాదయ్య, కేమ విష్ణు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించి ప్రాజెక్టు పనులు కొనసాగించండి

- ప్రాజెక్టు భూనిర్వాసితులు సమస్యలు పరిష్కరిస్తాం: ఆర్డీవో శ్రీరాములు



నవతెలంగాణ-నాంపల్లి

డిండి ఎత్తిపోతల పథకం భూనిర్వాసితుల సమస్యలను పరిష్కరించి ప్రాజెక్టు పనులను కొనసాగించాలని ఆర్డీఓ శ్రీరాములు అన్నారు. డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మిస్తున్న కిష్టారాయన్ పల్లి ప్రాజెక్టు ముంపు గ్రామమైన నాంపల్లి మండలంలోని స్వాములవారి లింగోటం ఆవాస గ్రామం లక్ష్మణపురం గ్రామ భూ నిర్వాసితులు గత నెల రోజులుగా ప్రాజెక్టు నిర్మాణం పనులను అడ్డుకోవడం జరిగింది. ప్రాజెక్టు కాంట్రాక్టర్ ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకు వెళ్లడంతో ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు దేవరకొండ ఆర్డీఓ శ్రీరాములు శుక్రవారం ప్రాజెక్టు నిర్మాణ పనులను పరిశీలించి అక్కడి నుండి లక్ష్మణపురం గ్రామానికి వెళ్లి నిర్వాసితుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్వాములవారి లింగోటం సర్పంచ్ అంగిరేకుల పాండు, నాంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ గట్టుపల్లి నర్సిరెడ్డి, నిర్వాసితులతో కలిసి ఆర్డీవోతో మాట్లాడుతూ ప్రాజెక్టు శంకుస్థాపన సందర్భంగా నిర్వాసితులకు ప్రతి ఒక్కరికి నష్టపరిహారం చెల్లించిన తర్వాతనే ప్రాజెక్టు నిర్మాణ పనులు చేపడుతామని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. కేవలం ఎకరానికి నాలుగు లక్షల 16 వేల రూపాయలు మాత్రమే నష్టపరిహారం ఇచ్చినప్పటికీ ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందనే ఉద్దేశంతో త్యాగం చేసి భూములు ఇస్తే ఒకేసారి ఇవ్వాల్సిన డబ్బులు ఇవ్వకుండా విడతల వారీగా ఇవ్వడంతో మాకు ఎలాంటి ఉపయోగం లేకుండా పోయిందని వాపోయారు. నేటి వరకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వకుండా, ముంపుకు గురవుతున్న తమ ఇంటి స్థలాలకు డబ్బులు ఇవ్వకుండా, పునరావాసం కల్పించకుండా దౌర్జన్యంగా ప్రాజెక్టు నిర్మాణ పనులు చేపట్టాలని చూస్తున్నారని అన్నారు. భూ నిర్వాసితులకు ఇవ్వాల్సిన 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, హైదరాబాద్ సమీపంలో ఇంటి స్థలాలు ఇచ్చి ఇల్లు నిర్మించి ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాకే ప్రాజెక్టు నిర్మాణ పనులు చేపట్టాలని దౌర్జన్యంగా పనులు చేపట్టాలని చూస్తే ప్రాణ త్యాగాలకు సైతం వెనకాడబోమని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆర్డీవో శ్రీరాములు వారితో మాట్లాడుతూ ప్రతి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేస్తానని ప్రాజెక్టు పనులు ఎలాంటి ఆటంకం లేకుండా చేపట్టడానికి సహకరించాలని వారిని కోరారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎలమందయ్య, డి ఈ జాను నాయక్, శైలజ, ఏ ఈ సతీష్ రెడ్డి, సరిత, సుధాకర్, నాంపల్లి ఇంచార్జ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రాఘవేందర్ రెడ్డి, నాంపల్లి సబ్ ఇన్స్పెక్టర్ లచ్చిరెడ్డి, మర్రిగూడ సబ్ ఇన్స్పెక్టర్ రంగారెడ్డి, డిప్యూటీ తాసిల్దార్ ఇసాక్, రెవిన్యూ ఇన్స్పెక్టర్ దయాకర్ రెడ్డి, వంశీకృష్ణ, రవికుమార్, నరేందర్ రెడ్డి, భూ నిర్వాసితులు పాల్గొన్నారు.



శాస్త్రవిజ్ఞాన ప్రదర్శన అభినందనీయం

నవతెలంగాణ-మిర్యాలగూడ రూరల్

విద్యార్థులకు 'స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్' అనే పేరుతో శాస్త్ర విజ్ఞాన ప్రదర్శనను నిర్వహించడం అభినందనీయమని ఎంఈఓ బాలాజీ నాయక్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని హౌసింగ్ బోర్డులోని లిటిల్ ఫ్లవర్ స్కూల్లోని ఐదవ తరగతిలోపు విద్యార్థులు నిర్వహించిన శాస్త్ర విజ్ఞన ప్రదర్శనలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి విజ్ఞానదాయకమైన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన పాఠశాల యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. పిల్లలు వివిధ శాస్త్ర, సాంఘిక, గణిత, ప్రకృతి ఇతర సాంకేతిక విషయాలపట్ల ఆసక్తిని కలిగించడం పట్ల ఆయన అభినందించారు. పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఇలాంటి ప్రదర్శనలు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో ట్రస్మా జిల్లా కార్యదర్శి గాద రవీందర్, ఆదిత్య హై స్కూల్ కరస్పాండెంట్ మారుతి అమరేందర్ రెడ్డి, లిటిల్ ఫ్లవర్ ప్రిన్సిపాల్ కేకే.జయరాజన్, వైస్ ప్రిన్సిపాల్ జీన్సీ జయరాజన్, ఉపాధ్యాయులు వినీష్ కుమార్, మధునాయర్, శంకర్, బాబు, రమేష్ కుమార్, వినోద్, చంద్రన్, పద్మ, పద్మావతి, జ్యోతి, సరిత, మమత, సిబ్బంది నాగు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా మోకాలిచిప్ప మార్పిడి శస్త్రచికిత్స



- ఎంవీఎస్ ట్రస్ట్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి
- ట్రస్ట్ కార్య నిర్వహణ కార్యదర్శి పి నర్సిరెడ్డి

నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్

తెలంగాణ సాయుధ పోరాట యోధులు, సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు మల్లు వెంకట నరసింహారెడ్డి (ఎంవిఎస్) 19వ వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఎంవిఎస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నల్లగొండ ఐఎంఏ సహకారంతో సత్యవతి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్లో ప్రతి ఏటా నిర్వహించే ఉచిత మోకాలు చిప్పల శస్త్ర చికిత్సలను ఈసారి కూడా విజయవంతంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని దేవరకొండ రోడ్డులో గల సత్యవతి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంవిఎస్ ట్రస్ట్ కార్యనిర్వహణ కార్యదర్శి పి. నర్సిరెడ్డి మాట్లాడుతూ ఎం వి ఎస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతినెల మూడవ ఆదివారం నర్రా రాఘవరెడ్డి ప్రజా వైద్యశాల ఎంవిఎస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో షుగర్, బిపి, పక్షవాతం, ఫిట్స్ ఉన్న సుమారు 300 మందికి ఉచితంగా మందులను పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. అంతేకాకుండా ఇటీవలే అక్టోబర్ 12వ తేదీ ఆర్థోపెడిక్ డే సందర్భంగా 150 మందికి ఉచితంగా మందులను పంపిణీ చేయడమే కాకుండా ఎక్రేలు, స్కానింగ్ లను కూడా ఉచితంగానే చేసినట్లు తెలిపారు.జిల్లా ప్రజలు ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించే వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం డాక్టర్ అరుణ్ రెడ్డి మాట్లాడుతూ మోకాలు నొప్పులతో ఇబ్బంది పడుతున్న ఇద్దరు పేదవారికి ఎం వి ఎస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గత సంవత్సరం నుండి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేస్తున్నట్లు తెలిపారు. ఇటీవలే నిర్వహించిన శస్త్ర చికిత్స అరుదైనదని, విజయవంతంగా పూర్తి అయిందని అన్నారు. ఈ సందర్భంగా శస్త్ర చికిత్స విజయవంతం గా పూర్తి చేసిన సత్యవతి మల్టీస్పెషల్టీ హాస్పిటల్ వైద్యుల ను అభినందించారు. అనేకమంది మోకాలు నొప్పులతో బాధపడుతున్న అవగాహన లేక భయంతో, ఆర్థికపరమైన కారణాలతో వైద్యం చేయించుకోవడంలేదని అలాంటి వారికి అవగాహన కల్పించి ఎంవిఎస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చికిత్సలు అందిస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా దాతలు ముందుకు వస్తే సేవలను మరింత ముందుకు తీసుకువెళతామని తెలిపారు. అనంతరం డాక్టర్ రామ్ మనోహర్ మాట్లాడుతూ మోకాలు వెలుపలకి వంగి ఉండటం చాలా తక్కువ మందిలో ఉంటుందని అలాంటి వారికి కూడా శస్త్ర చికిత్స చేయడం నేడు సత్యవతి మల్టీ హాస్పిటల్ లో కూడా జరుగుతుందని వివరించారు. ఆమనగల్లు కు చెందిన 65 సంవత్సరాల వృద్ధురాలికి శస్త్ర చికిత్స చేశామని, రోగి మరొక రెండు మూడు రోజుల్లో మామూలు గా నడవగలుగుతుందని తెలిపారు. అధునాతన వైద్యం సత్యవతి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ లో అందుబాటులో ఉందని జిల్లా ప్రజలు వైద్య సేవలను సద్విని చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో డాక్టర్ చైతన్య, వైద్యశాల మేనేజ్మెంట్ సూరేపల్లి సత్యం, కంప్యూటర్ ఫ్యాకల్టీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ హయాంలోనే అందరికీ సంక్షేమ పథకాలు

నవతెలంగాణ-చింతపల్లి

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతాయని, 18 సంవత్సరాల నిరీక్షణ అనంతరం మళ్లీ కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చిన ఘనత రేవంత్ రెడ్డికి చెల్లుతుందని గౌడ సంఘం జిల్లా నాయకులు కాంగ్రెస్ పార్టీ నాయకులు పడకంటి కృష్ణయ్య, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు కోడిదూటి శంకర్ అన్నారు. శుక్రవారం వారు చింతపల్లి మండలంలోని మాల్ గోడుకొండ్ల రిజర్వాయర్ దగ్గర విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం మొత్తంలో ఎన్ని అడ్డంకులు వచ్చినా ఎవరెన్ని నిందలు వేసిన రైతు ప్రభుత్వాన్ని తీసుకొచ్చారని, గెలిచిన తర్వాత ఒక వికలాంగురాలికి ఉద్యోగం కల్పించడం ఎంతో సంతోషకరమని, నిరుద్యోగ యువతులు అందరూ దీనికి ఇది ఒక ఉదాహరణ అని, త్వరలోనే నిరుద్యోగులకు నోటిఫికేషన్లు జారీ చేస్తారని వారి ఆశాభావం వ్యక్తం చేశారు. అదేవిధంగా ఆరోగ్యారంటీలతో నేటి నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మొదలవుతుందని వారన్నారు. దేవరకొండ నియోజకవర్గం లో పది సంవత్సరాలు ఒక అజ్ఞాతంలోకి వెళ్ళామని అజ్ఞాతం నుండి విడిపించిన రాముడు దేవుడైతే, దేవరకొండ నియోజకవర్గం ప్రజలకు నేనావత్ బాలునాయక్ ఒక దేవుడని 30 వేల ఓట్లతో దేవరకొండ నియోజకవర్గం లో అత్యధిక మెజార్టీ గెలిపించిన ఘనత ప్రతి ఒక్క కార్యకర్తలదని ఏ పార్టీ వారైనా ఎవరైనా అందర్నీ ఒకేలాగా చూసుకోవడం బాలునాయక్ లక్ష్యం అని వారన్నారు. ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లో రైతు రుణమాఫీ జరుగుతుందని వారు అన్నారు. దేవరకొండ నియోజకవర్గం ప్రజలు బాలునాయకు రుణపడి ఉన్నారని, ప్రతి ఒక్క కార్యకర్త వారి కుటుంబాలు ఎంతో సంతోషంగా ఉన్నాయని వారు అన్నారు. దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్ కు ఆర్థిక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దుబ్బాకుల మదర్ గౌడ్, దొంతగోని శ్రీశైలం గౌడ్, ఎనిమిది రాములు ఉన్నారు.

దళిత మహిళను హత్యచేసిన వారిని కఠినంగా శిక్షించాలి

- ప్రజా సంఘాల డిమాండ్

నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్

నల్లగొండ మండలం వెలుగుపల్లి గ్రామానికి చెందిన వల్లందాసు మంజుల(35) దళిత వివాహిత మహిళను అత్యంత దారుణంగా చున్నీతో ఉరివేసి రాళ్లతో కొట్టి చంపిన వారిని కఠినంగా శిక్షించాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున, ఎమ్మార్పీఎస్ జిల్లా సీనియర్ నాయకులు బాకరం శ్రీనివాస్, తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షుడు మానుపాటి బిక్షం లు డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. దళిత మహిళలపై అత్యంత దారుణ సంఘటనలు జరుగుతున్నాయని నిందితులు ఏదేచ్ఛగా తిరుగుతున్నారని ప్రభుత్వాలు కఠినమైన శిక్షలు విధించాలని దోషులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని, డిమాండ్ చేశారు. నిందితులపైన హత్య, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా మంజుల కుటుంబానికి రూ.20లక్షల పరిహారం ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, 3 ఎకరాల భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్థానిక డీస్పీ సమగ్రంగా విచారణ జరిపి దోషులను కటినంగా శిక్షించాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో కెవిపిస్ జిల్లా అధ్యక్షులు కొండేటి శ్రీను, విద్యార్థి సంగం అధ్యక్షులు కొండేటి మురళి,



కత్తుల సన్నీ, మృతురాలి కుమారుడు, పోతే పాక సహదేవ, వెలుగుపల్లి వార్డు మెంబర్లు పోతుపాక కిరణ్, పోతుపాక సతీష్, నాగార్జున, బ్రహ్మాచారి, గ్రామస్తులు పూతపాక యాదయ్య, పోతుపాక లింగయ్య, పుతపాక రవి, పూతపాక సైదులు, పోతపాక నవీన్, చింతపల్లి వెంకన్న, కండే యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.



'రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలి'

నవతెలంగాణ-నాంపల్లి

నూతనంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని నాంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ గట్టుపల్లి నర్సిరెడ్డి, స్వాములవారి లింగోటం సర్పంచ్ అంగిలేకుల పాండు కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం నాంపల్లి మండలంలోని స్వాములవారి లింగోటం ఆవాస గ్రామమైన లక్ష్మణపురం లో వారు విలేకరులతో మాట్లాడారు. అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న మునుగోడు నియోజకవర్గం అభివృద్ధి కావాలంటే మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని వారు అన్నారు. మునుగోడు నియోజకవర్గ సమస్యలపై రాజగోపాల్ రెడ్డి అనేకమార్లు అసెంబ్లీలో ప్రస్తావించినప్పటికీ బీఆర్ఎస్ ప్రభుత్వం ఆనాడు ఏమాత్రం పట్టించుకోలేదని అన్నారు. ఈ ప్రాంత సమస్యలపై, ప్రజల అవసరాలపై అవగాహన ఉన్న నాయకుడు కేవలం కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మాత్రమేనని ఆయనకు మంత్రివర్గంలో స్థానం కల్పించి ఈ ప్రాంత అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సంజీవరెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అమరుల త్యాగాలను గుర్తించడం అభినందనీయం



- తెలంగాణ సాయుధ పోరాట సంఘం అధ్యక్షులు బొమ్మ లక్ష్మీనారాయణ

నవతెలంగాణ-నార్కట్‌పల్లి

1969 తెలంగాణ సాయుధ పోరాట అమరుల త్యాగాలను కాంగ్రెస్ ప్రభుత్వం రెండవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తించడం అభినందనీయమని తెలంగాణ సాయుధ పోరాట సంఘం అధ్యక్షులు, సిపిఐ(ఎం) సూర్యాపేట జిల్లా కార్యవర్గ సభ్యులు బొమ్మ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అభినందనలు తెలిపేందుకు సూర్యాపేట నుంచి హైదరాబాదుకు వెళ్తూ నార్కట్ పల్లి దుర్గా హెూటల్‌లో ఆగి 1969 సాయుధ తెలంగాణ పోరాటం దళా అధ్యక్షునిగా పనిచేసిన దేవరశెట్టి మధుసూదన్, శారదాంబ దంపతుల చిత్రపటాలకు. నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. అమరుల త్యాగాల ఫలితంగా ఏర్పడిన తెలంగాణలో గత ప్రభుత్వాలు అమరుల కుటుంబాలను గుర్తించలేదని ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమరుల త్యాగాలను గుర్తించి నెలకి 25 వేల రూపాయల పెన్షన్ ఇవ్వడంతో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగము కుటుంబానికి ఆదుకోవడానికి 25 లక్షల రూపాయలు ఇస్తామని ప్రకటించడం హర్షదాయకమని చెప్పారు. ప్రమాణ స్వీకారం రోజు 250 మంది తెలంగాణ పోరాట యోధుల కుటుంబ సభ్యులను ఆహ్వానించడం శుభపరిణామం అని చెప్పారు. రేవంత్ రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో బడుగు బలహీన వర్గాలకు సమన్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మొదటగా హైదరాబాద్ లోని గన్ పార్క్ దగ్గర అమరవీరుల స్థూపానికి నివాళులర్పించి అనంతరం నూతన బాధ్యతలు స్వీకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అభినందనలు తెలియజేయునట్లు చెప్పారు. త్వరలోనే సాయుధ తెలంగాణ పోరాట యోధుల కుటుంబ సభ్యులచే రాష్ట్ర మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి అభినందన సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సాయుధ పోరాట సభ్యులు దేవత్ కిషన్ నాయక్, చేను పెద్దయ్య, కొత్త గురువయ్య, మిరియాల మధుసూదన్, నాసిని నరసింహారావు, చామల జగదీష్, బత్తుల కలమ్మ, బంధు రుద్రమ్మ, బెత్తం భద్రమ్మ , దేవర శెట్టి నారాయణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

చేనేత వస్త్రాలను ధరించాలి

- మిర్యాలగూడలో హస్తకళ ప్రదర్శన



నవతెలంగాణ-మిర్యాలగూడ

చేనేత వస్త్రాలు ధరిస్తే ఆరోగ్యంగా ఉండవచ్చని కళాభారతి అధ్యక్షులు జెల్లా సత్యనారాయణ సహాయ కార్యదర్శి శనిగరం అశోక్ అన్నారు చేనేత హస్తకళ ప్రదర్శన మిర్యాలగూడలోని సమ్మిడి వీరారెడ్డి ఫంక్షన్ హాల్ లో నిర్వహించారు శుక్రవారం ప్రదర్శనను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేనేత కళాకారులు ఎంతో శ్రమించి చేనేత వస్త్రాలను తయారు చేస్తున్నారని వాటిని కొనుగోలు చేసి చేనేత కార్మికులకు చేయూత ఇవ్వాలని కోరారు. మనం బతుకుదాం 10 మందికి బతకనిద్దాం నినాదంతో శ్రీ ఉషోదయ కళాభారతి ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రదర్శనలో అన్ని రకాల చేనేత వస్త్రాలు హస్తకళ వస్తువులు, గృహప్రకరణాలు ఉన్నాయని పట్టణ పరిసర ప్రాంతాల ప్రజలు వీటిని కొనుగోలు చేసి చేనేత కార్మికులను ఆదుకోవాలని కోరారు. ఈనెల 26 వరకు ఈ ప్రదర్శన కొనసాగుతుందని ప్రదర్శనను సందర్శించి వస్తువులు, చేనేత వస్త్రాలు కొనుగోలు చేయాలని కోరారు.

కేసీఆర్‌ను పరామర్శించిన మాజీ మంత్రి జానారెడ్డి

నవతెలంగాణ-పెద్దవూర

తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తన ఫామ్ హౌస్‌లో కాలుజారి పడటంతో కేసీఆర్‌కు గాయమైంది. దీంతో గురువారం అర్ధరాత్రి యశోద ఆస్పత్రిలో ఆయన్ను చేర్చారు. కేసీఆర్ కాలి ఎముక విరిగినట్లు వైద్యులు చెప్పారు. ప్రస్తుతం సోమాజిగూడలోని యశోద ఆస్పత్రిలో కేసీఆర్‌కు చికిత్స అందిస్తున్నారు.కాగా శుక్రవారం మాజీ మంత్రి జానారెడ్డి ఆయన సతీమణి సుమతి, తనయుడు నాగార్జున సాగర్ ఎంఎల్ ఏ జయవీర్ కుటుంభ సభ్యులు మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు నీ పరామర్శించడానికి యశోదా హాస్పిటల్ కు వెళ్లి అక్కడి వైద్యులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కుటుంభ సభ్యులను కూడా వివరాలు అడిగి తెలుసుకున్నారు.



'నిరుద్యోగుల కలలు నిజమౌతాయి'

నవతెలంగాణ-చింతపల్లి

తెలంగాణ రాష్ట్రంలో ప్రతి ఒక్క నిరుద్యోగి కలలు నిజమయ్యే రోజులు అతి సమీపంలోనే ఉన్నాయని నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు, దేవరకొండ నిరుద్యోగ సంఘం నాయకులు, కానుగుల ప్రదీప్ అన్నారు. శుక్రవారం ఆయన చింతపల్లి మండలంలోని కురుమేడు గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో నిరుద్యోగులు అధికమయ్యారని, కెసిఆర్ ప్రభుత్వంలో నిరుద్యోగ వ్యవస్థ ఆత్మహత్యలకు లోనయ్యారని అమరవీర కుటుంబాలకు మొండి చేయి ఇచ్చారని తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు సోనియా గాంధీ ఆధ్వర్యంలో తెచ్చుకున్న బంగారు తెలంగాణను, అప్పై తెలంగాణగా మరియు నిరుద్యోగుల తెలంగాణ గా మార్చిన ఘనత కెసిఆర్ కి దక్కుతుందని వారన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో బడుగు బలహీన వర్గాలు అభివృద్ధి చెందుతాయని రైతే రాజు అన్న కలను నెరవేర్చే ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందని వారన్నారు. దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలునాయక్‌కు అభినందనలు తెలిపారు.

నూతన దంపతులను ఆశీర్వదించిన చిరుమర్తి

నవతెలంగాణ-నకిరేకల్

కేతపల్లి మండలం గుడివాడ గ్రామ సర్పంచ్ కట్టా శ్రవణ్ వివాహం శుక్రవారం స్థానిక సువర్ణ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. ఆయన వెంట మునిసిపల్ ఛైర్మన్ రాచకొండ శ్రీనివాస్ గౌడ్, నాయకులు డాక్టర్ చెరుకు సుధాకర్, రాచకొండ సైదులు తదితరులు ఉన్నారు.



విలీన వీఆర్ఏల.. వేతన వెతలు..

- వీఆర్ఏలను విలీనం చేశారు.. వేతనాలు ఇవ్వడం మరిచారు
- నూతన ప్రభుత్వమైనా తమ సమస్యలు పరిష్కరిస్తుందా అని ఎదురు చూపులు
- ఏడు నెలలుగా వేతనాల కోసం ఎదురుచూస్తున్న వైనం

నవతెలంగాణ-మునుగోడు

గ్రామాల్లో రెవెన్యూ సహాయకులుగా ఉన్న వీఆర్ఏలను పేస్కేలు వర్తింపజేస్తూ వివిధ శాఖలలో విలీనం చేసిన వీఆర్ఏల పరిస్థితి "గడియ రికామ్ లేదు గవం దాని లేదు" అన్న చందంగా తయారైంది. గ్రామలో రెవెన్యూ సహాయకులు (వీఆర్ఏ)గా పనిచేసిన వారికి పే స్కేల్ ను వర్తింప చేస్తూ వివిధ శాఖలలో విలీనం చేసిన బిఆర్ఎస్ ప్రభుత్వం వేతనాలు చెల్లించే ప్రక్రియను పూర్తి చేయకపోవడంతో ఉద్యోగులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రెవిన్యూ శాఖలో కొనసాగిన ఉద్యోగులను నీటిపారుదల, విద్య, వైద్య, ఆరోగ్య, పంచాయతీరాజ్, వ్యవసాయ తదితర శాఖలలో విలీనం చేశారు. జూలైలో విలీనం కోసం ఉత్తర్వులను జారీ చేయడంతో పాటు పేస్కేల్ వర్తింపజేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా జిల్లాలో 759 మంది వీఆర్ఏలు వివిధ శాఖలలో విలీనం చేయబడ్డారు. మునుగోడు మండలంలో గతంలో వివిధ గ్రామాలలో విధులు నిర్వహిస్తున్న వీఆర్ఏలు 34 మంది ఉండగా 29 మంది వివిధ శాఖలలో విలీనమయ్యారు 60 ఏళ్ల పైబడిన ఐదు మంది వీఆర్ఏల కుటుంబ సభ్యులకు పోస్టింగ్ ఇవ్వాల్సి ఉంది. కొత్తగా వీఆర్ఏ నుంచి వివిధ ఓదాలలో పోస్టింగ్ పొందిన వీఆర్ఏలు మునుగోడు తాసిల్దార్ కార్యాలయంలో 11 మంది జూనియర్ అసిస్టెంట్, రికార్డర్ అసిస్టెంట్ తోపాటు వివిధ పోస్టుల లో విధులు నిర్వహిస్తున్నారు.



ఫైల్ ఫోటో..

ఐడెంటిటీ కార్డులు ఇవ్వలేదు.. ఖాతాలలో వేతనాలు జమ చేయడం లేదు..

పేస్కేల్ ఉత్తర్వులను జారీ చేసిన వెంటనే ఉద్యోగులకు ఏ శాఖలో పనిచేస్తే ఆ శాఖ ఉన్నతాధికారుల ద్వారా గుర్తింపు (ఐడెంటిటి) కార్డులను జారీ చేయాల్సి ఉంటుంది. గుర్తింపు కార్డు ఆధారంగా ఉద్యోగులకు ఆర్థిక శాఖ ద్వారా వేతనాలు ఖాతాలో జమవుతాయి. ఉద్యోగులకు ఐడెంటి కార్డులు జారీ చేయడంలో ప్రభుత్వం అలసత్వం ప్రదర్శించడంతో ట్రెజరీల ద్వారా వేతనాలు విడుదల కాలేకపోయాయి. వీఆర్ఏలను విలీనం చేసిన సమయంలో సరైన మార్గదర్శకాలను జారీ చేయకపోవడం, ఇది విధానాలను నిర్దేశించకపోవడంతో ఉద్యోగుల పరిస్థితి అయోమయంగా మారింది. విలీనం చేసిన తర్వాత నాలుగు నెలలు, గతంలో సమ్మె చేసిన రెండు నెలల కాలానికి సంబంధించిన వేతనాలు వీఆర్ఏలకు ప్రభుత్వం బకాయి పడింది. ప్రతి వీఆర్ఏకు 7 నెలల వేతనం చెల్లించాల్సి ఉండగా బీఆర్ఎస్ ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా కాలేదని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ఎన్నికల విధులతోపాటు తమ పని చేసే శాఖ అప్పగించిన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహించిన వేతనాలు అందించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. నూతనంగా ఏర్పాటు అవుతున్న ప్రభుత్వమైన స్పందించి తమ పెండింగ్ వేతనాలను విడుదల చేసి గుర్తింపు కార్డులను అందించాలని విలీన వీఆర్ఏలు విజ్ఞప్తి చేస్తున్నారు.



అన్ని వర్గాల కృషితోనే కోమటిరెడ్డి గెలుపు

- కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి, జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య

నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్

నల్గొండ నుంచి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలుపొందడంలో అన్ని వర్గాల సహకారం ఎంతో ఉందని నల్గొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి, జడ్పిటిసి వంగూరి లక్ష్మయ్య అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కోమటిరెడ్డి వెంకటరెడ్డి అత్యధిక మెజార్టీతో గెలుపొంది మంత్రి పదవి చేపట్టడంతో నల్గొండ పట్టణం, మండలంలోని పలు గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు మాల మహానాడు ఆధ్వర్యంలో శుక్రవారం నల్గొండలోని కోమటిరెడ్డి క్యాంపు కార్యాలయంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి, జెడ్పిటిసి వంగూరి లక్ష్మయ్యలను ఘనంగా సన్మానించారు. పూల బొకేలు, అందజేసి స్వీట్లు తినిపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గెలుపు కోసం కృషి చేసిన ప్రజలకు, పార్టీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సహకారంతో నల్గొండ నియోజకవర్గం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. గుమ్ముల మోహన్ రెడ్డి, జడ్పిటిసి లక్ష్మయ్యలను సన్మానించిన వారిలో కౌన్సిలర్ బుర్రి యాదయ్య రజిత, మాల మహానాడు జాతీయ నాయకులు,జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ రేకల భద్రాద్రి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాల మానాడు సీనియర్ నాయకులు కంచి మధు సుదన్, జాతీయ అధ్యక్షుడు తల్లమల్ల యాదగిరి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు యన్నమల్ల అనిల్ కుమార్,జిల్లా అధ్యక్షుడు చింతపల్లి లింగమయ్య, రేఖల సైదులు, యన్నమల్ల ప్రభాకర్, జయశంకర్, గాదరి రవి,గాలి నాగరాజు, తల్లమల్ల జనార్ధన్,శ్రీను, మహేష్, పలువురు ప్రైవేట్ ఉద్యోగుల సంఘం నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

నేటి నుంచే బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం

- ఏడు డిపోల్లో 521 బస్సులు
- సుమారు 70వేల మంది మహిళలు ప్రయాణం
- 45 నుంచి 50 లక్షల తగ్గనున్న ఆదాయం
- అన్ని డిపోల్లో లాంచనంగా ప్రారంభం
- మహిళలు సద్వినియోగం చేసుకోవాలి : అర్ఎం శ్రీదేవి



నవతెలంగాణ-మిర్యాలగూడ/నల్లగొండ కలెక్టరేట్

తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆర్టిసి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం నేటి నుంచి అమలు కానుంది. నేడు మధ్యాహ్నం అన్ని డిపో కేంద్రాలలో అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమాన్ని లాంచనంగా ప్రారంభించనున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏడు డిపోలలో సుమారు 70 వేల మంది రోజు బస్సులలో ప్రయాణించనున్నారు. దీనిగాను ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రతి రోజు 45 లక్షల నుంచి 50 లక్షల వరకు ఆర్టీసీకి ఆదాయం తగ్గనుంది. ప్రభుత్వం ప్రకటించిన ఈ అవకాశాన్ని జిల్లాలోని మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ అధికారులు పేర్కొంటున్నారు.

ఏడు డిపోలు... 521 బస్సులు

ఉమ్మడి నల్గొండ జిల్లాలోని నల్గొండ, మిర్యాలగూడ, సూర్యాపేట, కోదాడ, దేవరకొండ, నార్కట్పల్లి, యాదగిరిగుట్ట డిపో పరిధిలో పల్లె వెలుగు, ఎక్స్ప్రెస్ బస్సులు కలుపుకొని మొత్తం 521 బస్సులు ఉన్నాయి. ఇందులో 144 ఎక్స్ప్రెస్ బస్సులు నడుస్తున్నాయి. ఈ బస్సులోనే మహిళలకు ప్రయాణం ఉచితం చేయడంతో ఈ బస్సులలో మహిళలు ప్రయాణం చేయనున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రతిరోజు లక్ష 70 వేల మంది ప్రయాణికులు బస్సులో ప్రయాణిస్తున్నారు ఇందులో 40 శాతం అనగా సుమారు 70వేల మంది మహిళలు ప్రయాణిస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ప్రతిరోజు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కోటి 18 లక్ష రూపాయలు ఆదాయం రాగా మహిళలకు ఉచిత ప్రయాణం కారణంగా సుమారు 45 నుంచి 50 లక్షలు వరకు ఆదాయం తగ్గనుంది. ఈనెల చివరి లేదా జనవరి మొదటి వారంలో ఆయా డిపోలకు 12 ఎక్స్ప్రెస్ బస్సులు కొత్తవి రానున్నాయి.

ఏదైనా ఒకటి ధ్రువీకరణ కార్డు చూపించాలి

ఆర్టీసీ బస్సులో మహిళల ఉచిత ప్రయాణం కొరకు ప్రస్తుతం మహిళలు ఏదో ఒకటి ధ్రువీకరణ కార్డు చూపించాలి. తెలంగాణ వాసులుగా గుర్తించేందుకుగాను ప్రస్తుతం ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఓటర్ ఐడి కార్డు, తోపాటు ఏదో ఒకటి గుర్తింపు కార్డు చూపించాలి. కార్డు లేని వారు కూడా ప్రస్తుతం ప్రయాణం చేసే అవకాశం తాత్కాలికంగా కల్పించారు. మరో పది రోజుల్లో ప్రభుత్వాన్ని ఉచిత ప్రయాణం పై విధి విధానాలు ఖరారు కానుడడంతో దానికి అనుగుణంగా అన్ని డిపోలలో అమలు చేయనున్నారు. ప్రస్తుతం టికెట్ ఇచ్చేటప్పుడు రూపాయల దగ్గర జీరో అని ముద్రించి టికెట్ అందించనున్నారు. ఈ ఫార్మేట్ టిన్ మెషిన్లలో అమలు చేసేందుకు మరో వారం పది రోజులు సమయం పట్టే అవకాశం ఉంది.

లాంచనంగా ప్రారంభం

ప్రభుత్వ ఆదేశానుసారం నేడు మధ్యాహ్నం ఒంటిగంటకు అన్ని డిపోలలో ఆర్టీసీ బస్సులో మహిళకు ఉచిత ప్రయాణం లాంఛనంగా ప్రారంభించనున్నారు. నల్గొండ డిపోలో డిఆర్డిఏ పిడి కళాందిని, నార్కెట్పల్లి డిపోలో స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం, మిర్యాలగూడ, కోదాడ డిపోలలో స్థానిక ఆర్డీవోలు చెన్నయ్య సూర్యనారాయణ, దేవరకొండ డిపోలో మున్సిపల్ ఛైర్మన్ అలంపల్లి నర్సింహ, యాదగిరిగుట్ట డిపోలో యాదాద్రి దేవాలయం ఈవో గీత ఉచిత ప్రయాణాన్ని ప్రారంభించనున్నారు. సూర్యాపేట డిపోలో ఎవరు ప్రారంభిస్తారనేది ఇంకా నిర్ణయం చేయలేదు.

ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలు

ఏదైనా ఐడి కార్డు చూపించి మహిళలు ప్రయాణించవచ్చు.
లిమిట్స్ ఏమి ఉండవు.. ఎక్కడనుండైనా ఎక్కడికైనా వెళ్ళవచ్చు.
జీరో టిక్కెట్‌ని ఇష్యూ చేస్తారు.
ప్రయాణికులతో వినయంగా మర్యాద పూర్వకంగా మెలగాలి.
ఎలాంటి అసౌకర్యానికి గురి చేయవద్దు.
ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 647 బస్సులను ఈ పథకానికి ఉపయోగిస్తున్నారు.
ప్రభుత్వం కూడా ఫీ రియంబర్స్మెంట్ కూడా ఇస్తామని చెప్పింది.
త్వరలో ఎలక్ట్రిక్ బస్సులు కూడా రాబోతున్నాయి.
ఏ రోజైనా ఈ పథకం పని చేస్తుంది.
తీర్థయాత్రలకు ఒకే సారి వేళ్ళే వాళ్ళకి ఈ స్కీం వర్తించదు.
అవసరం ఉన్నచోట పురుషులకు కూడా స్పెషల్‌గా బస్సులు నడిపిస్తారు
ఈ స్కీంలో ఆర్డినరీ, ఏసీ బస్సులు కూడా నడిపిస్తాం.
మహిళల బస్సు పాసులు నేటి నుండి పనిచేయవు.
రియాంబర్స్మెంట్ చేసేది లేదు.
మహిళలకు ప్రాధాన్యత పెరుగుతుంది.

మహిళలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి: ఆర్టీసీ ఆర్ఎం శ్రీదేవి



రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న బస్సులు మహిళల ఉచిత ప్రయాణం మహిళలందరూ వినియోగించుకోవాలని ఆర్టీసీ రిజినల్ మేనేజర్ శ్రీదేవి తెలిపారు. బస్సులోనే ప్రయాణం సురక్షితంగా ఉంటుంది. ఆటోలు జీపులు ప్రైవేటు వాహనాలలో ప్రయాణించడం వల్ల ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ప్రభుత్వం ఆర్టీసీ బస్సులలో మంచి సదుపాయాలు కల్పిస్తుందని కాబట్టి మహిళలందరూ బస్సులోనే ప్రయాణించి గమ్యస్థానాలకు సురక్షితంగా చేరాలి. తమ ఇంట్లో ఉన్న పురుషులకు కూడా బస్సులోనే ప్రయాణించే విధంగా మహిళలు చొరవ చూపెట్టాలి.

సమాజ సేవలో కడారి లక్ష్మణ్

నవతెలంగాణ-చండూరు



ఒకపక్క ఉద్యోగం చేసుకుంటూ మరోపక్క తనదైన శైలిలో చిన్న తనం నుండే తనవంతు సమాజ సేవ చేయాలన్నదే కడారి లక్ష్మణ్ దృక్పథం. తన గ్రామంలో విద్యా, వైద్య రంగంల్లో ఎలాంటి సాయం కోరినా కాదనకుండా సాయం చేసే వ్యక్తిగా పేరు పొందారు. మునుగోడు నియోజకవర్గంలోని చండూరు మండలంలోని ఇడికూడా గ్రామానికి చెందిన కడారి లక్ష్మణ్ శుక్రవారం నవతెలంగాణతో మాట్లాడారు. ఈయన 2002 సంవత్సరంలో ఉస్మానియా క్యాంపస్లో కంప్యూటర్ సైన్స్ ఎంసీఏ పూర్తి చేశాడు. టెన్త్, ఇంటర్లో టాపర్‌గా నిలిచారు. చిన్న తనం నుండి టెన్త్, ఇంటర్మీడియట్, ఐటిఐ విద్యార్థులకు ఫ్రీగా ట్యూషన్ చెప్పేవాడు. అప్పట్లో ఇదే గ్రామానికి దేవాలయానికి తన వంతుగా 50వేల రూపాయలు ఆర్థిక సహాయం చేశారు. ప్రపంచంలో టాప్ 5వ కంపెనీలో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఒకపక్క ఉద్యోగం చూసుకుంటూనే 20 మందికి పైగా యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు తెలిపారు. చదువుకున్న విద్యార్థులకు కళాశాలలో సీట్లు కావాలన్నా యాజమాన్యంతో మాట్లాడి తక్కువ ఖర్చుతో సీటు ఇప్పించేవారు. రియల్ ఎస్టేట్ రంగం లో అత్యున్నత నైపుణ్య కలిగిన వ్యక్తి.. రాజకీయరంగంలోనూ దీటుగా ప్రశించే వ్యక్తి, ఈయన 2018 సంవత్సరంలో ఆ గ్రామ సర్పంచిగా కాంగ్రెస్ పార్టీ నుండి పోటీ చేసి స్వల్ప మెజార్టీతో అక్కడ ఉన్న కాంగ్రెస్ నాయకుల వైఫల్యంతో ఓటమి చెందారు. అయినా చెక్కుచెదరకుండా గ్రామంలో ప్రజాసేవ చేసుకుంటూ, హైదరాబాదు నుండి నెలకు మూడు సార్లు చొప్పున తన స్వగ్రామానికి వచ్చి గ్రామ సమస్యలు అడిగి తెలుసుకుంటారు. ఆ దిశగా ఓ గుర్తింపు సంపాదించుకున్నారు. ఆ గ్రామంలో కడారి లక్ష్మణ్ అనగానే ప్రతి ఒక్కరికి గుర్తుండిపోతుంది. ఇటీవల మునుగోడు అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తన సింగిల్యాండ్లో గ్రామంలో 207 ఓట్లతో మెజార్టీతో గెలుపొందించారు. ముందు ముందు భవిష్యత్తులో తన నుండి ఉన్నదాంట్లో సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు.

జగదీష్ రెడ్డికి సన్మానం



నవతెలంగాణ-నకిరేకల్

సూర్యాపేట నియోజకవర్గ ఎమ్మెల్యేగా మూడవసారి హ్యాట్రిక్ విజయం సాధించిన మాజీ విద్యుత్ శాఖ మంత్రి గుంతకండ్ల జగదీశ్వర్ రెడ్డిని నకిరేకల్ బిఆర్ఎస్ నాయకులు శుక్రవారం కలిసి ఘనంగా సన్మానించారు.

సన్మానించినవారిలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై వెంకటేశ్వర్లు, శ్రమశక్తి అవార్డు గ్రహీత సిలువేరు ప్రభాకర్, లింగమంతుల దేవాలయ ఛైర్మన్ కోడి సైదులు తదితరులు ఉన్నారు.